తెలంగాణ పేపర్

తెలుగు దినపత్రిక

బుధవారం కొండగట్టు లో గిరి ప్రదక్షిణ

కరీంనగర్ : గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని కొండగట్టు ఆంజనేయస్వామి గిరి ప్రదక్షిణ మంగళవారం ఉదయం 5 గంటలకు ప్రారంభం కానుంది. రైతుల సంక్షేమం, సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొంటారని చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం తెలిపారు. కొండగట్టు గిరి ప్రదక్షిణ ఏ రాజకీయ పార్టీకి సంబంధించినది కాదని, సకలజనుల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమమని ఆయన పేర్కొన్నారు. కోరిన కోర్కెలు తీర్చే కొండగట్టు ఆంజనేయస్వామి గిరి ప్రదక్షిణలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అలాగే దేవాలయాల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి తీసుకుంటున్న చర్యలను అభినందించిన ఆయన, నారాయణపూర్ రిజర్వాయ
పనులు 90 శాతం పూర్తయ్యాయని, ముంపు గ్రామాల ప్రజలకు పూర్తి పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు.

హైదరాబాద్ సంపుటి: 13 సంచిక : 251 | సంపాదకులు : నస్రీన్ ఖాన్ | బుధవారం, జులై 29, 2026 | పేజీలు : 8 వెల : రూ. 2/-

చర్చకు ప్రభుత్వం.. క్షమాపణకు విపక్షం.. పట్టు

ప్రశ్నపత్రాల లీకేజీపై లోక్‌సభలో బిల్లు
2024 చట్టం కఠినతరం చేసేలా ప్రతిపాదనలు
చర్చ చేపట్టడానికి ప్రతిపక్షాలు ససేమిరా
విద్యార్థులకు ప్రధాని క్షమాపణ చెప్పాలని డిమాండ్
ఉభయ సభలు నేటికి వాయిదా
లోక్‌సభలో ఆందోళన చేస్తున్న విపక్ష సభ్యులు

దిల్లీ: ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడినవారికి కఠిన శిక్షలు విధించేలా 2024నాటి చట్టాన్ని సవరించే బిల్లును కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. చర్చకు లోక్‌సభలో ఆరు గంటలు, రాజ్యసభలో ఏడుగంటలు చొప్పున సమయాన్ని కేటాయిస్తున్నట్లు సభాపతులు ప్రకటించారు. అయితే నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో దిల్లీలో దీక్షలు చేపట్టినప్పుడు విద్యార్థులపై పోలీసులు ప్రవర్తించిన తీరుమీద సమగ్రంగా చర్చ చేపట్టాల్సిందేనని విపక్షాలు డిమాండ్ చేసి సభలను స్తంభింపజేశాయి. విద్యార్థి లోకానికి ప్రధాని నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పాలని, వారిపై పోలీసుల దాష్టీకానికి గానూ హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులో ప్రకటన చేయాలని అవి గట్టి పట్టుపట్టాయి. ఈ పరిస్థితుల మధ్యే 'పబ్లిక్ పరీక్షల్లో అనుచిత పద్ధతుల నివారణ సవరణ బిల్లు-2026'ను కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. పెల్లెట్లు ప్రయోగించి ఆందోళనకారుల్ని గాయపరిచినవారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలన్నీ గళమెత్తాయి. అధికార-విపక్షాలు విభేదాలు పరిష్కరించుకునేందుకు స్పీకర్ ఓం బిర్లా మూడు గంటల సమయం ఇచ్చి సభను వాయిదా వేసినా సయోధ్య కుదరలేదు. రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి కనిపించింది.

విపక్షనేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ- చర్చ నుంచి తాము పారిపోవడం లేదని, ముందు హోంమంత్రి వచ్చి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సాయంత్రం వరకు పరిస్థితి మారకపోవడంతో ఉభయ సభాపతులు సభలను మరుసటిరోజుకు వాయిదా వేశారు. బిల్లుపై లోక్‌సభలో మంగళవారం చర్చ జరిగే అవకాశం ఉంది. ఆ మేరకు విపక్షాలను స్పీకర్ ఒప్పించారు.

ప్రభుత్వం సమాధానం చెప్పాలి

విపక్షాల నిరసనల మధ్య రెండు సభలు పలుమార్లు వాయిదా పడ్డాయి. బిల్లుపై సమగ్ర చర్చ నిర్వహించాలని ప్రతిపక్షాలకు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు విజ్ఞప్తి చేశారు. పార్లమెంటులో గందరగోళం సృష్టించకుండా విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా నిర్మాణాత్మక చర్చ జరపాలని, పరీక్షల వ్యవస్థలో సంస్కరణల కోసం ప్రధాని ప్రకటించిన చర్యలను గుర్తించాలని కోరారు. సంతృప్తి చెందని విపక్షాలు పార్లమెంటు సముదాయంలో నిరసనలు కొనసాగించాయి. మాజీ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లోక్‌సభలో అడుగుపెడుతున్నప్పుడు అధికార పక్షం- 'జిందాబాద్..జిందాబాద్' అని, విపక్షం 'చోర్ చోర్.. పేపర్ చోర్' అని పోటాపోటీగా నినాదాలు చేశాయి.

చట్టంలో ఏడు కీలక సవరణలు

పబ్లిక్ పరీక్షల బిల్లులో ఏడు కీలక మార్పులు ప్రతిపాదించారు.

- పేపర్ లీక్‌లు, పరీక్షల అక్రమాలకు సంబంధించిన కేసుల విచారణను ఫాస్ట్‌ట్రాక్ కోర్టులతో వేగవంతం చేయడం, నిందితులకు కఠిన శిక్షలు విధించడం, పర్యవేక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంది.
- ఛార్జిషీటు దాఖలు చేసిన మూడు నెలల్లో విచారణ పూర్తిచేయాలని ప్రతిపాదించారు.
- రెండు నెలల్లో దర్యాప్తు ముగించాల్సి ఉంటుంది.
- పరీక్షల అక్రమాల దర్యాప్తు కోసం అవసరమైతే కేంద్రం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తుంది.
- రాష్ట్రాలు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించుకునే అధికారం పొందుతాయి.
- నేరస్థులకు మరింత కఠిన జైలుశిక్షలు, భారీ జరిమానాలు విధించే అవకాశం ఉంటుంది.
- హైకోర్టు డివిజన్ బెంచ్‌లో నిర్ణీత గడువులో అప్పీలు చేసే విధానాన్ని కూడా బిల్లులో చేర్చారు.
- పరీక్షల్లో అక్రమ పద్ధతులను అవలంబిస్తే పదేళ్ల వరకు జైలుశిక్ష విధించేలా చట్టంలో మార్పులను ప్రభుత్వం ప్రతిపాదించింది. వ్యవస్థీకృత నేరాలకు కనీసం ఏడేళ్ల జైలుశిక్ష, రూ. 10 కోట్ల వరకు జరిమానా పడుతుంది.
- అక్రమార్కులకు గరిష్ఠ జరిమానాను రూ. 10 లక్షల నుంచి రూ. 50 లక్షలకు, సర్వీస్ ప్రొవైడర్స్‌కు విధించే జరిమానాను రూ.కోటి నుంచి రూ. 5 కోట్లకు పెంచుతూ నిబంధన చేర్చారు.
- పరీక్షల నుంచి సర్వీస్ ప్రొవైడర్స్‌ను నిషేధించే కాలాన్ని నాలుగేళ్ల నుంచి ఎనిమిదేళ్లకు పొడిగించాలని ప్రతిపాదించారు.
- ప్రశ్నపత్రాల లీకేజీతో పాటు ఓఎంఆర్ షీట్లలో అక్రమాలు, నకిలీ వెబ్‌సైట్ల సృష్టి, తప్పుడు అడ్మిట్‌కార్డుల తయారీ వంటి 15 పనులను చట్టవిరుద్ధమైనవిగా పరిగణిస్తారు.

దేశంలో అత్యంత సంపన్న ముఖ్యమంత్రులుగా దక్షిణాది నేతలు

- ముఖ్యమంత్రుల ఆస్తులు, కేసులు ఏపీ
- -తెలంగాణ సీఎంలది ప్రత్యేక స్థానం!
- ఆస్తుల్లో కర్ణాటక సీఎం డీకే శివకుమార్ మొదటి స్థానం
- ఏపీ సీఎం చంద్రబాబుకు రెండో స్థానం.
- క్రిమినల్ కేసుల్లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి అగ్రస్థానం.
- రేవంత్ రెడ్డిపై దేశంలోనే అత్యధికంగా 80 కేసులు నమోదు.



హైదరాబాద్ : దేశంలోని ముఖ్యమంత్రుల ఆస్తులు, వారిపై ఉన్న క్రిమినల్ కేసుల వివరాలతో అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ ఏడీఆర్ ఓ నివేదికను విడుదల చేసింది. దేశంలోని 28 రాష్ట్రాలు,3 కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 31 మంది సీఎంల ఎన్నికల అఫిడవిట్లను విశ్లేషించి ఈ రిపోర్ట్ రూపొందించింది. ఈ నివేదిక ప్రకారం, దేశంలో అత్యంత సంపన్న ముఖ్యమంత్రులుగా దక్షిణాది నేతలే తొలి మూడు స్థానాల్లో నిలిచారు.రూ. 1413 కోట్ల ఆస్తులతో కర్ణాటక సీఎం డీకే శివకుమార్ మొదటి స్థానంలో ఉండగా, రూ. 931 కోట్ల ఆస్తులతో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు రెండో స్థానంలో నిలిచారు. తమిళనాడు సీఎం విజయ్ రూ. 648 కోట్లతో మూడో స్థానం దక్కించుకున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ. 30 కోట్లకు పైగా ఆస్తులతో ఈ జాబితాలో 8వ స్థానంలో ఉన్నారు.క్రిమినల్ కేసుల విషయానికొస్తే, దేశంలోని ముఖ్యమంత్రులందరిలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అగ్రస్థానంలో నిలిచారు. ఆయనపై ఏకంగా 80 కేసులు ఉన్నట్టు ఏడీఆర్ పేర్కొంది. రేవంత్ తర్వాత పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారిపై 29 కేసులు, కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌పై 19 కేసులు ఉన్నాయి. 19 కేసులతో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఈ జాబితాలో నాలుగో స్థానంలో ఉన్నారు. దేశంలోని 31 మంది సీఎంలలో 14 మందిపై క్రిమినల్ కేసులు ఉండటం గమనార్హం. ఈ జాబితాలో అత్యల్ప ఆస్తులు కలిగిన సీఎంగా జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా రూ. 55 లక్షలు నిలిచారు. మొత్తం 31 మంది సీఎంల మొత్తం ఆస్తుల విలువ రూ. 8,660 కోట్లుగా ఏడీఆర్ తన నివేదికలో వెల్లడించింది.

ఢిల్లీలో తెలంగాణ కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాలపై కీలక సమీక్ష



హైదరాబాద్ : ఢిల్లీ ఏఐసీసీ ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్లో తెలంగాణ కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాలపై కీలక సమీక్ష సమావేశం ముగిసింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్గనైజేషన్ కేసీ వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు మరియు ఎస్ఎస్ఏ జాతీయ ఇన్చార్జ్ చల్లా వంశీచంద్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ తో పాటు ఇతర పార్టీ నేతలు పాల్గొన్నారు.దాదాపు రెండు గంటల పాటు జరిగిన సమావేశంలో తెలంగాణలో బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు చేపట్టిన సంస్థాగత కార్యక్రమాలు, ఎస్ఎస్ఏ సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమాల పురోగతిపై సమగ్రంగా సమీక్షించారు.తెలంగాణలో నిర్వహించిన సంస్థాగత కార్యక్రమాలపై కేసీ వేణుగోపాల్ సంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు, సంఘటన్ సృజన్ అభియాన్ అమలును అభినందించారు.అదే సమయంలో, ఎస్ఎస్ఏ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అమలు చేయాలని పార్టీ నాయకత్వానికి సూచించారు.

విద్యార్థులపై పోలీసుల తీరు సరికాదు: ప్రియాంకా గాంధీ



యాంటీ-పేపర్ లీక్ బిల్లు పై లోక్‌సభలో జరుగుతున్న చర్చలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళనకారులపై పెల్లెట్ గన్స్ వినియోగించడాన్ని, లాఠీఛార్జి చేయడాన్ని తప్పుబట్టారు. ఆయుధాలు ప్రయోగించడానికి వారేమైనా ఉగ్రవాదులా అని ప్రశ్నించారు. విద్యార్థుల మీద పోలీసుల దౌర్జన్యంపై ప్రధాని మోదీ.. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశయువత తమ ప్రజాస్వామ్య హక్కులను శాంతియుతంగా వినియోగించుకుంటుండగా.. వారిపై దాడి చేయడం సరైన చర్య కాదన్నారు.

విద్యార్థుల నిరసనను ఆయుధాలతో అణచివేయాలని పోలీసులకు ఎవరు ఆదేశాలు ఇచ్చారని ఆమె ప్రశ్నించారు. పేపర్ లీక్‌ల కారణంగా బలవన్మరణానికి పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పిల్లల్ని కోల్పోయిన తల్లిదండ్రుల బాధ ఎవరు తీరుస్తారని ప్రశ్నించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం: ప్రజావాణిని పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్ : ప్రజా సమస్యలకు వేగవంతమైన పరిష్కారం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని హైదరాబాద్ జిల్లా ఇంచార్జి, బీసీ సంక్షేమం మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.మంగళవారం ప్రజా భవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ప్రజావాణికి వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, సంబంధిత అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రధానంగా భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, గృహాలు, రెవెన్యూ, మున్సిపల్, సంక్షేమం తదితర వివిధ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులపై సమీక్ష నిర్వహించి, అర్హులైన ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రవాసి ప్రజావాణి ద్వారా విదేశాల్లో ఉపాధి, ఉద్యోగాలు, ఇతర కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలంగాణ ప్రజల వినతులను కూడా మంత్రి పరిశీలించి, సంబంధిత శాఖల సమన్వయంతో వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజావాణిలో ప్రజల నుంచి ప్రతిరోజూ అందుతున్న వినతులు, వాటి పరిష్కార స్థితి, శాఖల వారీగా తీసుకుంటున్న చర్యలపై మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిశీలించి, నిర్ణీత గడువులో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి విద్యాసాగర్‌లతో మంత్రి మాట్లాడి ప్రజావాణి నిర్వహణ, సమస్యల పరిష్కార ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు.ప్రజల సమస్యలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి వినతికి పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కారం అందేలా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

కృష్ణా జలాలపై మాట్లాడే హక్కు భారాసకు లేదు
-మంత్రి వాకిటి



హైదరాబాద్ : కృష్ణా జలాలపై మాట్లాడే హక్కు భారాసకు లేదని రాష్ట్ర పశు సంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. భారాస హయాంలో కర్ణాటకలో డ్యాంలు కట్టినప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు కర్ణాటకలోని గూడూరు ప్రాంతాన్ని నందర్శించిన నందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై చేసిన విమర్శలను మంత్రి సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. 'జూరాల ప్రాజెక్టు పరిధిలోని రైతుల ప్రయోజనాలను గత భారాస ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. భీమా, కృష్ణా నదుల నీటిని నిల్వ చేసి సాగు, తాగునీరు అందించాలనే ఆలోచన కూడా గత ప్రభుత్వానికి రాలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోంది. కర్ణాటక ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ కృష్ణా, భీమా నదులపై బ్యారేజీ-కమ్-బ్రిడ్జిల నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్‌లు సిద్ధం చేశాం. జూరాల ముంపు గ్రామాలైన భూత్పూర్, నేడుగం, అనుగొండ, అంకెనపల్లి, దాదంపల్లి ప్రజల సమస్యలను దశాబ్దకాలంగా పట్టించుకోలేదు. ప్రస్తుతం ఆ గ్రామాల అభివృద్ధి, పునరావాసం, భూత్పూర్ డ్యాం విస్తరణ వంటి అంశాలపై మా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పాలమూరు ప్రజల భవిష్యత్తు కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంటే, ప్లకార్డులు పట్టుకుని రాజకీయ డ్రామాలు చేయడం వల్ల ప్రజలు నమ్మే పరిస్థితి లేదు' అని వాకిటి పేర్కొన్నారు.

తెలంగాణ పవర్

సంపాదకీయం

బుధవారం, జులై 29, 2026

విద్యామంత్రులకు ఏమొతోంది....

విద్యార్థుల నిరసనల అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. దీంతో ఆయన మోదీ ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖలో గడువు ముగియక ముందే బాధ్యతల నుంచి తప్పుకున్న మంత్రుల జాబితాలో చేరిపోయారుభారత విద్యా వ్యవస్థపై జంతర్ మంతర్ వద్ద మొదలైన ప్రశ్నలు, వారం రోజుల్లోనే దేశవ్యాప్త యువజన ఆందోళనగా మారాయి. కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్లను ఆమోదించిన తర్వాత ఈ ఉద్యమ ముగింపును ప్రకటించారు.అయితే, ఈ ఉద్యమం భారత విద్యా వ్యవస్థ, పరీక్షల నిర్వహణ తీరు, ప్రభుత్వ ప్రాధాన్యతలపై ఒక కొత్త చర్చకు తెరలేపింది. ఇప్పుడు ప్రశ్నలు కేవలం ప్రస్తుత విద్యాశాఖ మంత్రిపైనే కాకుండా, మోదీ ప్రభుత్వ హయాంలో విద్యా మంత్రిత్వ శాఖ నడిచిన మొత్తం దిశపైనే వ్యక్తమవుతున్నాయి. 2014 నుంచి ఇప్పటివరకు స్మృతి ఇరానీ, ప్రకాశ్ జావదేకర్, రమేశ్ పోఖ్రియాల్ 'నిశంక్', ధర్మేంద్ర ప్రధాన్ నాయకత్వంలో విద్యా మంత్రిత్వ శాఖ సరికొత్త విద్యా విధానాన్ని, సంస్థాగత మార్పులను, భావజాలపరమైన ఎన్నో చర్చలను చూసింది.ఈ సంవత్సరాలలో విద్యా వ్యవస్థను మెరుగుపరచడం కంటే భావజాల మార్పులకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారని విమర్శకులు ఆరోపిస్తుండగా, ప్రభుత్వం మాత్రం దీనిని ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న నిర్మాణాత్మక సంస్కరణల ప్రక్రియగా పేర్కొంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో, మోదీ హయాంలోని నలుగురు విద్యాశాఖ మంత్రుల పాత్రను ఏ కోణంలో చూడాలనే ప్రశ్నను ప్రస్తుత వివాదం మరోసారి తెరపైకి తెచ్చింది.12 ఏళ్ల మోదీ ప్రభుత్వంలో విద్యా మంత్రిత్వ శాఖ మాత్రమే నలుగురు వేర్వేరు మంత్రుల మారిన ఏకైక కీలక శాఖగా నిలిచింది. అదే సమయంలో హోం, విదేశీ వ్యవహారాలు, ఆర్థిక, రక్షణ, ఆరోగ్య వంటి మంత్రిత్వ శాఖలలో మాత్రం దాదాపు స్థిరత్వం కొనసాగింది.ముఖ్యమైన విషయమేమిటంటే, ఈ ముగ్గురు మాజీ విద్యాశాఖ మంత్రులు పదవుల నుంచి తప్పుకున్న కొద్ది సంవత్సరాలకే వివిధ కారణాల వల్ల కేంద్ర క్యాబినెట్ నుంచి కూడా పూర్తిగా కనుమరుగయ్యారు.సమాచార-ప్రసార శాఖలో గత 12 ఏళ్ల వ్యవధిలో ఏడుగురు కేంద్ర మంత్రులు, సంస్కృతి మంత్రిత్వ శాఖలో ఐదుగురు కేంద్ర మంత్రులు మారారు.మోదీ ప్రభుత్వ మొదటి విడత పదవీకాలంలో స్మృతి ఇరానీ, ప్రకాశ్ జావదేకర్ మానవ వనరుల వికాస మంత్రిత్వ శాఖ బాధ్యతలను నిర్వహించారు. మోదీ 2.0 హయాంలో ఈ బాధ్యత రమేశ్ పోఖ్రియాల్ నిశంక్‌కు దక్కింది.అయితే, 2021లో జరిగిన క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ సమయంలో ధర్మేంద్ర ప్రధాన్‌ను కేంద్ర విద్యాశాఖ మంత్రిగా నియమించారు. ఆయన రాజీనామా డిమాండ్‌తో కాక్రోచ్ జనతా పార్టీ మద్దతుదారులు నెల రోజుల పాటు జంతర్ మంతర్ వద్ద ఆందోళనకు కూర్చున్నారు, చివరికి కేంద్ర ప్రభుత్వం ఆ ఒత్తిడికి తలొగ్గింది. పార్లమెంటులో నీట్ లీక్ వ్యవహారంపై చర్చ జరపడానికి మోదీ ప్రభుత్వం అంగీకరించింది, కానీ, రాజీనామా డిమాండ్‌ను చర్చకు షరతుగా పెట్టవద్దని ప్రతిపక్షాలకు కోరుతూ వచ్చింది. నీట్ పరీక్ష లీక్ కేసును పక్కన పెడితే, సంఘ్‌కు సంబంధించిన అన్ని ప్రధాన లక్ష్యాలను ధర్మేంద్ర ప్రధాన్ ఎలాంటి హడావుడి లేకుండా అమలు చేయడంలో విజయం సాధించారు..2014లో ఏర్పాటైన మొదటి మోదీ క్యాబినెట్‌లో ధర్మేంద్ర ప్రధాన్‌ను పెట్రోలియం శాఖ మంత్రిగా నియమించారు. ఆ తర్వాత మోదీ 2.0లో ఆయన విద్యాశాఖ మంత్రి అయ్యారు, మోదీ 3.0 పదవీకాలంలోనూ ఆ బాధ్యతల్లోనే కొనసాగారు.ఆయన పదవీకాలంలో జాతీయ విద్యా విధానానికి ఊతం లభించింది. మాతృభాష, పలు భాషల్లో విద్యను ఆయన ప్రోత్సహించారు. కానీ, త్రిభాషా సూత్రంపై తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వంతో సుదీర్ఘకాలం పాటు వివాదాలకు కేంద్రబిందువుగా నిలిచారు.. రాజకీయ జోక్యం, 'హిందీ రుద్దడం' లాంటి ఆరోపణలను ప్రత్యర్థులు ఆయనపై గుప్పించారు, దీనివల్ల విద్యా విధానం కేంద్రం వర్సెస్ రాష్ట్రాల వివాదంగా మారింది.మోదీ పాలనలో విద్యాశాఖలో అవలంబించిన విధానాలన్నీ వామపక్ష భావజాలాన్ని తొలగించే లక్ష్యంతోనే అమలయ్యాయని శరద్ గుప్తా పేర్కొన్నారు.భారత విద్యా వ్యవస్థ నుంచి వామపక్ష విద్యా విధానాన్ని తొలగించడమే సంఘ్ ప్రధాన లక్ష్యం..2014లో స్మృతి ఇరానీని మానవ వనరుల అభివృద్ధి(హెచ్ఆర్డీ) మంత్రిగా నియమించినప్పుడు, ఆమె రాహుల్ గాంధీ చేతిలో ఓడిపోయిన తర్వాత క్యాబినెట్‌లో భాగమయ్యారు.మోదీ రెండవ విడత పదవీకాలంలో మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ పేరును మార్చారు. జాతీయ విద్యా విధానంలోని ప్రధాన సిఫార్సులలో భాగంగా 'విద్యపై మరింత దృష్టి పెట్టడానికి' కేంద్ర ప్రభుత్వం ఈ మార్పు చేసింది.1985 కంటే ముందు ఈ శాఖను 'విద్యా మంత్రిత్వ శాఖ' అనే పిలిచేవారు. అప్పటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ పాలనలో దీని పేరును మార్చారు. అప్పట్లో 'విద్యను మరింత విస్తృత కోణంలో చూడటం' దీని వెనుక ఉన్న ఉద్దేశంగా చెప్పారు.2014 లోక్‌సభ ఎన్నికల అఫిడవిట్ ప్రకారం, స్మృతి ఇరానీ చదువు 12వ తరగతి వరకే సాగింది. దీనిని కాంగ్రెస్ ఒక పెద్ద అంశంగా మార్చింది. అయితే, ఆమె పార్లమెంటులో హిందీ, ఇంగ్లీష్ భాషల్లో తన వాదనను చాలా స్పష్టంగా, బలంగా వినిపిస్తారని చెబుతూ బీజేపీ ఈ విమర్శలను తోసిపుచ్చింది.నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాతే నూతన విద్యా విధానంపై కసరత్తు మొదలైంది.మంత్రిత్వ శాఖలో స్మృతి ఇరానీ పదవీకాలంలో నూతన విద్యా విధానానికి సంబంధించిన పనులు ప్రారంభం కాగా, మోదీ హయాంలోని మూడవ విద్యాశాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ 'నిశంక్' సమయంలో దీనిని అమలు చేశారు.భారతదేశంలో నూతన విద్యా విధానం 34 సంవత్సరాల తర్వాత 2020లో అమల్లోకి వచ్చింది. దీనిని మోదీ పదవీకాలంలో ఒక పెద్ద అడుగుగా భావిస్తారు. నూతన విద్యా విధానంలో విద్యా బడ్జెట్‌ను జీడీపీలో ఆరు శాతంగా ఉంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.నలుగురు విద్యాశాఖ మంత్రుల హయాంలో దాదాపు ప్రతి విశ్వవిద్యాలయంలోనూ అధ్యాపకుల ఎంపికలో భావజాలానికే పెద్దపీట వేశార్లు.

- ఎడిటర్

జీఎంఆర్ ఏరో టెక్నిక్ -- హనీవెల్ ఏరోస్పేస్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం

LEAP ,+›H• LRU MRO సేవల కోసం లైసెన్స్ ఒప్పందం

హైదరాబాద్, 28 జూలై 2026: భారతదేశంలోని ప్రముఖ విమానాల నిర్వహణ, మరమ్మతులు మరియు ఓవర్‌హాల్ (MRO) సంస్థ జీఎంఆర్ ఏరో టెక్నిక్, హనీవెల్ ఏరోస్పేస్‌తో LEAP ఇంజిన్ లైన్ రీప్లేసబుల్ యూనిట్స్ (LRUs) నిర్వహణ, మరమ్మతులు మరియు ఓవర్‌హాల్ సేవల కోసం లైసెన్స్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం ద్వారా భారతదేశంలో అత్యాధునిక వీ=నా సేవల విస్తరణకు ఊతమివ్వడంతో పాటు, దేశీయ విమానయాన రంగ సామర్థ్యాల అభివృద్ధిలో జీఎంఆర్ ఏరో టెక్నిక్ కీలక పాత్రను మరింత బలోపేతం చేయనుంది.

ఈ ఒప్పందం కింద, Airbus A320neo మరియు Boeing 737 MAX విమానాల్లోని ¬ుజ్యూ¬ా ఇంజిన్లకు అమర్చిన హనీవెల్ ఏరోస్పేస్‌కు చెందిన ఏడు కీలక ¬ా=ఖంకు జీఎంఆర్ ఏరో టెక్నిక్ సమగ్ర మరమ్మతులు, ఓవర్‌హాల్ మరియు డిపో స్థాయి నిర్వహణ సేవలను అందించనుంది. ఈ సేవల్లో పరికరాలను పూర్తిగా విడదీయడం, సాంకేతిక తనిఖీలు, అవసరమైన మరమ్మతులు, తిరిగి అమరిక మరియు పనితీరు పరీక్షలు నిర్వహించడం ఉంటాయి.

ఈ సందర్భంగా జీఎంఆర్ ఏరో టెక్నిక్ ప్రెసిడెంట్ ఉ అకౌంటబుల్ మేనేజర్ అశోక్ గోపీనాథ్ మాట్లాడుతూ, ''హనీవెల్ ఏరోస్పేస్‌తో మా భాగస్వామ్యం కాంపోనెంట్ MRO సేవల్లో మరో కీలక మైలురాయి. హనీవెల్ సాంకేతిక నైపుణ్యాన్ని, మా అత్యాధునిక మౌలిక సదుపాయాలను సమన్వయం చేస్తూ, భారతదేశంతో పాటు ప్రాంతీయ LEAP ఇంజిన్ ఆపరేటర్లకు వేగవంతమైన, నాణ్యమైన మరియు విశ్వసనీయ మరమ్మత్తు సేవలను అందించేందుకు కట్టుబడి ఉన్నాము'' అని తెలిపారు. హనీవెల్ ఏరోస్పేస్ -- యూరప్, మధ్యప్రాచ్యం, ఆఫ్రికా మరియు భారతదేశం అధ్యక్షుడు కూపర్ కలెన్ మాట్లాడుతూ, ''భారతదేశం ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విమానయాన మార్కెట్లలో ఒకటి. మా ప్రాంతీయ ఎయిర్‌లైన్ వినియోగదారులకు అత్యుత్తమ LEAP ఇంజిన్ LRU మద్దతు సేవలను అందించడం మా ప్రధాన లక్ష్యం. భారతదేశంలో మా వీ=నా కార్యకలాపాలను విస్తరించే క్రమంలో జీఎంఆర్ ఏరో టెక్నిక్ మా కీలక భాగస్వామిగా నిలవనుంది'' అని పేర్కొన్నారు.



ఈ భాగస్వామ్యం ద్వారా విమాన వ్యవస్థలు మరియు అత్యాధునిక సాంకేతికతలలో హనీవెల్‌కు ఉన్న ప్రపంచస్థాయి నైపుణ్యం, జీఎంఆర్ ఏరో టెక్నిక్‌కు ఉన్న అత్యాధునిక మౌలిక సదుపాయాలు, ధృవీకృత సౌకర్యాలు మరియు నైపుణ్యం కలిగిన సిబ్బంది ఒకే వేదికపైకి వస్తున్నారు. ఈ కార్యక్రమం ప్రాంతీయ స్థాయిలోనే మరమ్మత్తు సేవలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా సేవల పూర్తి సమయాన్ని గణనీయంగా మెరుగుపరచడంతో పాటు, సేవల నాణ్యతను పెంచి, భారతదేశంతో పాటు ఈ ప్రాంతంలోని ఎయిర్‌లైన్ వినియోగదారులకు మరింత వ్యయ-సమర్థవంతమైన మరమ్మత్తు పరిష్కారాలను అందించనుంది.

ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం, జీఎంఆర్ ఏరో టెక్నిక్ తన వీ=నా సామర్థ్యాలను విస్తరించాలనే దీర్ఘకాలిక దృష్టికి అనుగుణంగా ఉండటమే కాకుండా, దేశీయ మరమ్మత్తు సామర్థ్యాలను అభివృద్ధి చేయడం మరియు విదేశీ వీ=నా సేవలపై ఆధారపడటాన్ని తగ్గించడం ద్వారా భారత ప్రభుత్వ "మేక్ ఇన్ ఇండియా" కార్యక్రమానికి కూడా తోడ్పడుతుంది.

శక్తివంతమైన పనితీరు... సరికొత్త సాంకేతికతతో మారుతి సుజుకి నూతన బ్రెజ్జా టర్బో బూస్టర్ జెట్ సిసీనటి అనన్య నాగళ్ల చేత ఆవిష్కరణ

హైదరాబాద్, జూలై 27: దేశంలోనే అగ్రగామి మారుతి సుజుకి డీలర్ సంస్థ వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లి అత్యాధునిక సాంకేతికత, శక్తివంతమైన పనితీరు, అధునాతన భద్రతా ప్రమాణాలతో రూపొందించిన లినూతన బ్రెజ్జా టర్బో బూస్టర్జెట్‌లి వాహనాన్ని హైదరాబాద్లోని బేగంపేట షోరూమ్లో ఘనంగా ఆవిష్కరించింది.

ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటి లిఅనన్య నాగళ్లలి ముఖ్య అతిథిగా హాజరై వాహనాన్ని ఆవిష్కరించారు. మారుతి సుజుకి ఇండియా వాణిజ్య విభాగాధిపతి లిసురేష్ బాబు, ప్రాంతీయ మేనేజర్ లిలిజి. పార్థిబన్‌లి ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. వరుణ్ మోటార్స్ కార్యనిర్వాహక సంచాలకుడు లివి.ఆర్.సి. రాజు, ప్రధాన జనరల్ మేనేజర్ లిలిఎస్. కౌశిక్, జనరల్ మేనేజర్ కె. కృష్ణ కుమార్‌లి, సంస్థ ప్రతినిధులు, సిబ్బంది ఈ వేడుకలో పాల్గొన్నారు.

భారతదేశంలో అత్యధికంగా అమ్ముడవుతున్న కాంపాక్ట్ ఎస్యూవీగా గుర్తింపు పొందిన లిబ్రెజ్జాలికు మరింత శక్తివంతమైన టర్బో బూస్టర్జెట్ ఇంజిన్ను జోడిస్తూ యువత అభిరుచులకు అనుగుణంగా ఈ కొత్త మోడల్ను రూపొందించారు. ఆకర్షణీయమైన రూపకల్పన, వేగవంతమైన పనితీరు, సౌకర్యవంతమైన డ్రైవింగ్ అనుభూతిని అందించేలా ఈ వాహనాన్ని అభివృద్ధి చేశారు.



కొత్త బ్రెజ్జా ముందు భాగంలో ప్రత్యేక గ్రిల్, ఆధునిక బంపర్, కొత్త అలాయ్ వీల్స్, ప్రత్యేక టర్బో గుర్తింపుతో మరింత ఆకర్షణీయమైన రూపాన్ని సంతరించుకుంది. శక్తివంతమైన ఎస్యూవీ రూపకల్పనతో పాటు రహదారిపై ప్రత్యేక గుర్తింపును కల్పించేలా దీనిని తీర్చిదిద్దారు.

భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఐదు నక్షత్రాల భద్రతా ప్రమాణాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన ఈ వాహనంలో లిబ్లైండ్ స్పాట్ హెచ్చరిక వ్యవస్థ, లేన్ మార్పు హెచ్చరిక, వెనుకవైపు వాహనాల హెచ్చరిక, టైర్ గాలి ఒత్తిడి పర్యవేక్షణ వ్యవస్థ, అత్యవసర బ్రేకింగ్ సంకేతం, 360 డిగ్రీల కెమెరా వ్యవస్థలి వంటి అధునాతన భద్రతా సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి.

అలాగే లి10.1 అంగుళాల టచ్స్క్రీన్ వినోద వ్యవస్థ, అంతర్నిర్మిత అంతర్జాల అనుసంధానం, 35కు పైగా అనువర్తనాలు, వైర్లెస్ మొబైల్ అనుసంధానం, వాయిస్ సహాయక వ్యవస్థ, అత్యుత్తమ ధ్వని వ్యవస్థ, 64 రంగులతో అంతర్గత వాతావరణ లైటింగ్‌లి వంటి అత్యాధునిక సాంకేతిక సౌకర్యాలను ఇందులో పొందుపరిచారు.

వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా లిటర్బో, టెర్రాస్కేవ్, మెట్రోస్కేవ్‌లి పేర్లతో ప్రత్యేక అలంకరణ ప్యాకేజీలను కూడా సంస్థ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇవి వాహనానికి మరింత ఆకర్షణీయమైన రూపాన్ని అందించడంతో పాటు వ్యక్తిగత అభిరుచులకు తగ్గట్టుగా ఎంపిక చేసుకునే అవకాశాన్ని కల్పిస్తాయి.

ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, యువత అవసరాలు, ఆధునిక సాంకేతికత, భద్రత, శక్తివంతమైన వనితీరును నమన్వయం చేస్తూ రూపొందించిన నూతన బ్రెజ్జా వినియోగదారులకు కొత్త తరహా డ్రైవింగ్ అనుభూతిని అందిస్తుందని తెలిపారు.

నూతన బ్రెజ్జా టర్బో బూస్టర్జెట్ ప్రారంభ ఎక్స్‌షోరూమ్ ధర రూ. 7.39 లక్షల నుంచి, 1.5 లీటర్ ఇంజిన్ మోడల్ ధర రూ. 8.29 లక్షల నుంచి అందుబాటులో ఉంటుందని వరుణ్ మోటార్స్ వెల్లడించింది.

భారతీయ కళలతో సమాజాభివృద్ధి - అంతర్జాతీయ భారతీయ సంగీత నృత్య సదస్సు దిగ్విజయం





భారతీయ కళలు సంస్కృతి సంప్రదాయాల ఔన్నత్యాన్ని ఒకే వేదికపై చూపించాలనే లక్ష్యంతో అంతర్జాతీయ స్థాయిలో భారతీయ సంగీత నృత్య సదస్సును నిర్వహించినట్లు విపంచి సంస్థ అధ్యక్షులు మహీంద్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ రాజారావు త్రిపురనేని తెలిపారు. రెండు రోజుల సదస్సు దిగ్విజయం అయ్యిందని, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు అద్భుత ప్రదర్శనలు, అభినయ ఉపన్యాసాలు చేశారని అభినందించారు. విపంచి సంస్థ 10వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శిల్పకళా వేదికలో రెండు రోజుల పాటు నిర్వహించిన సదస్సు ఆదివారం ఘనంగా ముగిసింది. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన పలువురు కళాకారులు పరిశోధకులను సత్కరించారు. ముగింపు సభలో డాక్టర్ రాజారావు త్రిపురనేని మాట్లాడుతూ కళలు మానసిక ఉల్లాసాన్ని, ప్రశాంతతను ఇస్తాయని, కళల పట్ల యువతను ఆకర్షించాలనే అంతర్జాతీయ సదస్సు లక్ష్యం నెరవేరిందని సంతోషం వ్యక్తం చేశారు. కళలతో సమాజాభివృద్ధి జరుగుతుందని, కళా సంపదను కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తొలుత హైదరాబాద్ కు చెందిన ప్రముఖ భరత నాట్యం గురు డాక్టర్ హరి మంగళంపల్లి తన ఐదుగురు కుమార్తెలు హరిణి, హన్సిక, హంసిక, స్వాంతమయి, విశాఖ లతో కలసి చేసిన భరత నృత్యాంశాలు అలరించాయి. నాట్యగురు నేహా సింగ్ చేసిన నాట్యం ఆకట్టుకుంది. 32 మంది ఆరభి మ్యూజిక్ స్కూల్ విద్యార్థులు కళారత్న డాక్టర్ అశోక్ గుర్జాలే సంగీత దర్శకత్వంలో ప్రదర్శించిన వయోలిన్ సింఫనీ ఈ సదస్సుకు సంపూర్ణతను చేకూర్చింది. చెన్నై కీ బోర్డు కళాకారుడు కలైమామణి డాక్టర్ కె. సత్యనారాయణన్ చేసిన కీ బోర్డు విన్యాస ప్రదర్శన ప్రేక్షకులను కట్టి పడేసింది. సంగీత స్వరాల మహత్తు గురించి ఆయన చేసిన ఉపన్యాసం స్ఫూర్తినిచ్చింది. ముంబయి నుంచి వచ్చిన సీనియర్ కళాకారిణి డాక్టర్ రాజ్యలక్ష్మి సేథ్ కూచిపూడి విలక్షణ అంశాలను ప్రస్తావిస్తూ జతి, శబ్ద పల్లవి, ఆరోహణ, అవరోహణ తదితర అంశాలను వివరిస్తుండగా ఔరంగాబాద్ కు చెందిన తన శిష్యులు బధిర కళాకారిణి లహరి పెద్దింటి, స్వరాలి భూపేష్ నర్తించారు. డాక్టర్ శైలజా దేశాయ్ బృందం కూచిపూడి (ముంబయి), అర్చన మిశ్రా కథక్ (కోల్ కతా), సోనాలి మొహంతి ఒడిస్సి (భువనేశ్వర్) నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మలేషియాకు చెందిన నాట్య గురు గీత గోవర్ధనం హజారే తన శిష్య బృందంతో కలసి ఆంధ్ర నాట్యం అద్భుతంగా ప్రదర్శించి కరతాళధ్వనులు అందుకున్నారు. రెండు రోజుల పాటు వ్యాఖ్యాతగా వ్యవహరించి రక్తి కట్టించిన కళారత్న గాయత్రిరావును ఘనంగా సత్కరించారు. డాక్టర్ రాజారావు త్రిపురనేని, కేంద్ర సంగీత నాటక అకాడమి సభ్యురాలు డాక్టర్ ఎస్. పి. భారతి, లయన్ పద్మావతి, డాక్టర్ శైలజా దేశాయ్ సమన్వయం చేశారు.

పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించిన మంత్రి పొంగులేటి



హైదరాబాద్: రెండు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురై, హైదరాబాద్ యశోద హాస్పిటల్లో చికిత్స పొందుతున్న నర్సంపేట్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తో కలిసి పరామర్శించారు.

ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకొని, వారికి అత్యుత్తమ మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

తరువాత వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని, ఆయన ఆరోగ్య సంరక్షణకు అవసరమైన అన్నిరకాల సహాయ సహకారాలు ప్రభుత్వం తరపున అందిస్తామని భరోసా ఇచ్చారు.

విద్యార్థులకు నాణ్యమైన యూనిఫామ్‌లు అందించడమే లక్ష్యం



నాగర్ కర్నూల్ (తెలంగాణ పవర్) జూలై 28 : కోడేరులో యూనిఫామ్ కుట్టు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ, ఆగస్టు 15లోపు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తొలి జత, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీ), మోడల్ స్కూల్‌లు, మహాత్మా జ్యోతిబా ఫూలే గురుకుల విద్యాలయాల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి ప్రభుత్వం అందించే ఉచిత స్కూల్ యూనిఫామ్‌లు నాణ్యతతో, సరైన కొలతలతో, నిర్దేశిత గడువులో అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు.

మంగళవారం కోడేరు మండల కేంద్రంలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూనిఫామ్ స్టిచ్చింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా క్లాత్ కటింగ్, దుస్తుల కుట్టు విధానం, నాణ్యత ప్రమాణాలు, పనుల పురోగతి, వస్త్రాల వినియోగం, కొలతల నమోదు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

యూనిఫామ్‌ల తయారీలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి దుస్తును విద్యార్థుల వ్యక్తిగత కొలతలకు అనుగుణంగా కుట్టాలని కలెక్టర్ సూచించారు. అనంతరం మహిళా టైలర్లతో మాట్లాడి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కుట్టు పనుల్లో వేగంతో పాటు నాణ్యతకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని, విద్యార్థులు ధరించినప్పుడు సౌకర్యవంతంగా ఉండేలా కటింగ్, కుట్టు, ఫినిషింగ్ పనులను అత్యంత జాగ్రత్తగా పూర్తి చేయాలని ఆదేశించారు.

అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, కోడేరు మండలంలోని 33 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 2,138 మంది విద్యార్థులతో పాటు కేజీబీవీ, మోడల్ స్కూల్, మహాత్మా జ్యోతిబా ఫూలే గురుకుల విద్యాలయాల్లోని 1,152 మంది విద్యార్థులకు మొత్తం 15 మంది మహిళా సంఘాల టైలర్లు యూనిఫామ్‌లను కుట్టుతున్నారు.

ప్రభుత్వం మహిళా సంఘాలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఈ బాధ్యతలను అప్పగించడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. మహిళా సంఘాలపై ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టే విధంగా బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

మండలంలోని మూడు గురుకుల విద్యాలయాల విద్యార్థులకు వచ్చే వారం రోజుల్లోనే రెండు జతల యూనిఫామ్‌లను పూర్తి చేసి అందజేయాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి స్వాతంత్ర్య దినోత్సవం అయిన ఆగస్టు 15లోపు ఒక జత యూనిఫామ్ తప్పనిసరిగా అందేలా చర్యలు తీసుకోవాలని, రెండో జత యూనిఫామ్‌ల పంపిణీని ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేసి ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫామ్‌లు అందేలా కార్యాచరణ చేపట్టాలని సూచించారు.

కేజీబీవీ విద్యార్థులకు ఇప్పటికే రెండు జతల యూనిఫామ్‌లు పంపిణీ చేయడంతో మహిళా సంఘాల సభ్యులు, టైలర్లను కలెక్టర్ అభినందించారు.

చివరిగా, యూనిఫామ్‌ల తయారీలో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, కుట్టు పనుల్లో ఎలాంటి లోపాలు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అధికారులు మరియు మహిళా సంఘాలు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులో పనులను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.

జిల్లా కలెక్టర్ వెంట అదనపు డీఆర్‌డీఏ అధికారి రాజేశ్వరి, డీపీఎం కృష్ణ, ఏపీఎం సంతోష్, గౌస్, మండల స్థాయి అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, టైలర్లు తదితరులు ఉన్నారు.

క్యాన్సర్ చికిత్సలో అత్యాధునిక విప్లవం 'హైపర్‌సైట్'తో సైడ్ ఎఫెక్ట్స్ లేని వైద్యం

- రేడియేషన్ థెరపీలో గేమ్ ఛేంజర్‌గా మారిన అడాప్టివ్ థెరపీ

- 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ స్క్రీనింగ్ తప్పనిసరి

- సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్ స్రవంతి వెల్లడి



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి తెలంగాణ పవర్ (జూలై 28): క్యాన్సర్ మహమ్మారి అనగానే ఒకప్పుడు భయం... కానీ ఇప్పుడు అత్యాధునిక వైద్య పరిజ్ఞానంతో ఆ భయాన్ని పారద్రోలే రోజులు వచ్చాయి. క్యాన్సర్ చికిత్స అనగానే రోగులను తీవ్రంగా వేధించేది రేడియేషన్ వల్ల వచ్చే సైడ్ ఎఫెక్ట్స్ (దుష్ప్రభావాలు). కానీ, సరికొత్త సాంకేతికత 'హైపర్‌సైట్' మెషిన్ రాకతో క్యాన్సర్ చికిత్సలో నవశకం మొదలైందని, దీని ద్వారా సైడ్ ఎఫెక్ట్స్ దాదాపు లేకుండా సురక్షితంగా చికిత్స అందించవచ్చని యశోద హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ వైద్యురాలు డాక్టర్ స్రవంతి స్పష్టం చేశారు. క్యాన్సర్ ముప్పు, కారణాలు, నూతన చికిత్సా విధానాలపై ఆమె పలు కీలక విషయాలను పంచుకున్నారు.

'హైపర్‌సైట్'తో అద్భుత ప్రయోజనాలు

క్యాన్సర్ కణాలను అంతం చేసే రేడియేషన్ థెరపీలో అడాప్టివ్ థెరపీ అనేది ఒక గొప్ప విప్లవమని డాక్టర్ స్రవంతి అభివర్ణించారు. అధునాతన 'హైపర్‌సైట్' మెషిన్ ద్వారా జరిగే ఈ చికిత్సలో అనేక సానుకూల అంశాలు ఉన్నాయని తెలిపారు:

సైడ్ ఎఫెక్ట్స్‌కు చెక్: ఈ నూతన విధానం ద్వారా చికిత్స చేయడం వల్ల రోగుల్లో 40% వరకు సైడ్ ఎఫెక్ట్స్ తగ్గుతాయి. అనవసరమైన కణజాలంపై రేడియేషన్ పడకుండా ఇది కాపాడుతుంది.

బ్రీతింగ్ కంట్రోల్: రోగి శ్వాసను నియంత్రిస్తూ కచ్చితత్వంతో చికిత్స చేయడం దీని ప్రత్యేకత. దీనివల్ల చుట్టుపక్కల ఉండే ఆరోగ్యకరమైన అవయవాలకు ఎలాంటి నష్టం వాటిల్లదు.

గంటల తరబడి యంత్రాల మీద ఉండాల్సిన అవసరం లేకుండా, ఈ ఆధునిక యంత్రం ద్వారా చికిత్స చాలా త్వరగా, సౌకర్యవంతంగా పూర్తవుతుంది.

స్త్రీ, పురుషుల్లో క్యాన్సర్‌కు ప్రధాన కారణాలు ఇవే..

ప్రస్తుత రోజుల్లో క్యాన్సర్ బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతుండటానికి ప్రధానంగా మన జీవనశైలిలో వస్తున్న పెను మార్పులే కారణమని డాక్టర్ స్రవంతి విశ్లేషించారు.

పురుషుల్లో: మగవారిలో ఎక్కువగా ధూమపానం అలవాటు వల్లే శ్వాసనాళ, ఊపిరితిత్తుల క్యాన్సర్లు వస్తున్నాయి. పొగతాగడం మానేయడం ద్వారా ఈ ముప్పును చాలా వరకు నివారించవచ్చు.

స్త్రీలలో: మహిళల్లో రొమ్ము క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. అయితే ఇందులో సుమారు 10 శాతం కేసులు జన్యుపరమైన కారణాల వల్ల వస్తుండగా, మిగిలినవి జీవనశైలి, స్థూలకాయం తదితర కారణాల వల్ల వస్తున్నాయి.

భారతదేశంలో ప్రధాన సమస్య:

నిర్లక్ష్యమే శాపం విదేశాలతో పోలిస్తే భారతదేశంలో క్యాన్సర్ మరణాలకు ప్రధాన కారణం 'నిర్లక్ష్యం' అని డాక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. మన దేశంలో చాలా మంది రోగులు వ్యాధి ముదిరిన తర్వాత, అంటే స్టేజ్ 3 లేదా స్టేజ్ 4కి (ళూఖ్ఘస్త్రవ 3 ఁ ళూఖ్ఘస్త్రవ 4) చేరుకున్న తర్వాతే ఆసుపత్రులకు వస్తున్నారని, అప్పటికే క్యాన్సర్ శరీరమంతా వ్యాపించి ఉండటం వల్ల చికిత్స సంక్లిష్టంగా మారుతోందని తెలిపారు. ప్రాథమిక దశలో లక్షణాలను గుర్తించకపోవడం, అవగాహన లేమి, భయమే దీనికి కారణమన్నారు.

నివారణకు ఉన్న ఒకే ఒక్క మార్గం.. 'స్క్రీనింగ్'

క్యాన్సర్‌ను జయించాలంటే మన ముందున్న ఏకైక మరియు అత్యుత్తమ మార్గం 'రెగ్యులర్ స్క్రీనింగ్' మాత్రమేనని డాక్టర్ స్రవంతి స్పష్టం చేశారు.

40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ (ముఖ్యంగా మహిళలు మామోగ్రామ్, పురుషులు లంగ్/ప్రోస్టేట్ స్క్రీనింగ్) విధిగా ఏటా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి.

కుటుంబంలో క్యాన్సర్ చరిత్ర ఉన్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలి.

వ్యాయామం, సరైన పోషకాహారం, చెడు అలవాట్లకు దూరంగా ఉండటం ద్వారా క్యాన్సర్ మహమ్మారికి చెక్ పెట్టవచ్చు.

ఆధునిక వైద్యం అందుబాటులో ఉన్న ఈ రోజుల్లో క్యాన్సర్ ఒక మరణశాసనం కాదని, సరైన సమయంలో గుర్తిస్తే 'హైపర్‌సైట్' లాంటి విప్లవాత్మక సాంకేతికతలతో సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితం గడపవచ్చని డాక్టర్ స్రవంతి భరోసా ఇచ్చారు.

స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

- పాలెం అంబేద్కర్ చౌరస్తా దగ్గర ఏబీవీపీ నాయకులు రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ శవయాత్ర తీసి దహనం చేయడం జరిగింది





నాగర్ కర్నూల్ (తెలంగాణ పవర్): జులై : 28 : తెలంగాణ రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆరోపిస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ూదీఎూ) పాలెం శాఖ ఆధ్వర్యంలో ఈరోజు ఏబీవీపీ నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శవయాత్ర కార్యక్రమం నిర్వహించారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో దిష్టిబొమ్మ అంబేద్కర్ చౌరస్తాలో కాల్చడం జరిగింది., రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న మొత్తం స్కాలర్‌షిప్ మరియు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

దహనం చేయడానికి విద్యార్థులు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకుని దిష్టిబొమ్మను ఆర్పే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ూదీఎూ నాగర్ కర్నూల్ జిల్లా కన్వీనర్ శాంతన్ మాట్లాడుతూ, నీట్ విద్యార్థుల సమస్యలపై కొడంగల్‌లో ముఖ్యమంత్రి ధర్నా నిర్వహించడం స్వాగతించదగిన విషయమే అన్నారు. అయితే, అదే సమయంలో తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది మంది పేద విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం నెలుల తరబడి ఎదురుచూస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం తీవ్ర విచారకరం అని విమర్శించారు.

ప్రభుత్వానికి నీట్ విద్యార్థుల బాధలు కనిపిస్తున్నప్పుడు, తెలంగాణలోని ప్రభుత్వ, ఎయిడెడ్, డిగ్రీ, యూనివర్సిటీ, గురుకుల విద్యార్థుల ఆర్థిక ఇబ్బందులు ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో వేలాది మంది విద్యార్థులు కళాశాలల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పరీక్షలు, అడ్మిషన్లు, సర్టిఫికెట్లు వంటి అంశాల్లో తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు.

ప్రభుత్వం ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, పదివేల కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయాలి తక్షణమే జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేయాలి టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలి,పెండింగ్‌లో ఉన్న మొత్తం స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని ూదీఎూ డిమాండ్ చేసింది. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించింది.

విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయొద్దు.

నీట్ విద్యార్థులకు చూపుతున్న చొరవనే తెలంగాణ పేద విద్యార్థులపైనా చూపించండి.

స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయండి. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంగన మోని బంగారు బాబు, బిజినపల్లి మండల కన్వీనర్ జీవన్, పాలెం టౌన్ సెక్రటరీ విష్ణు, నాగర్ కర్నూల్ నగర కార్యదర్శి ప్రసాద్ కుమార్, నగర సంయుక్త కార్యదర్శి శివ, భరత్,సందీప్, రెహ్మాన్,మార్కండేయ, మురళి, మల్లేష్ ఏబీవీపీ నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

మణుగూరు ఓసి టు డిప్ సైడ్ బ్లాక్ ను సింగరేణి కేటాయించాలి

లేకుండా ఆందోళన ఉధృతం చేస్తాం - సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి జూలై 28 తెలంగాణ పవర్ : సిపిఐ పినపాక నియోజకవర్గం స్థాయి సమావేశం మంగళవారం మణుగూరు సిపిఐ పార్టీ కార్యాలయంలో జంగం మోహన్ రావు అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా హాజరై మాట్లాడుతూ..1979లో మణుగూరులో సింగరేణి ప్రారంభమై అంచలంచలుగా ఈ ప్రాంత అభివృద్ధికి సింగరేణి ఎంతో దోహదం చేసిందని, వేలాది మంది సింగరేణి కార్మికులు ఈ ప్రాంతంలో పనిచేసినప్పుడు మణుగూరు కళకళలాడిందని, సింగరేణి అభివృద్ధి కొరకు ఈ ప్రాంత ప్రజలకు కూడా తమ భూములు, ఇండ్లు త్యాగం చేసి సింగరేణి అభివృద్ధికి పాటు పడ్డారని,నేడు సింగరేణి లో ఉన్నటువంటి బొగ్గు బ్లాక్లను ప్రైవేట్ పరం చేయాలని చూస్తుందని దీనివలన సింగరేణి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారబోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి తెలంగాణకే వెలుగులు నింపే బొగ్గును రాష్ట్ర ప్రభుత్వం 51% కేంద్ర 49% వాటా ఉన్న సింగరేణిని బ్లాకులను ఎందుకు ప్రైవేటుపరం చేయాలని చూస్తున్నారని ఇది సరైన విధానం కాదని ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వం స్పందించి మణుగూరు ఓసి డిసైడ్ బ్లాకును సింగరేణికే కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. సింగరేణి మీద ప్రత్యక్షంగా పరోక్షంగా గుమస్తాలు ,కోల్ ట్రాన్స్పోర్ట్ ,లారీ ఓనర్స్ బొగ్గుముట ,కార్మికులు పంచర్ షాపులు ,ఇలా ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు పదివేల మంది ఈ సింగరేణి మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారని సింగరేణి కేటాయించి మణుగూరు ఓసి ఎక్టెన్షన్ పర్మిషన్ తీసుకురావాలని, లేని పక్షంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వరరావు, ముప్ప వెంకటేశ్వరరావు, మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్, అశ్వాపురం మండల కార్యదర్శి అనంతనేని సురేష్, బూర్గంపాడు మండల కార్యదర్శి సబ్బా నాగేశ్వరరావు, పినపాక మండల కార్యదర్శి తోగటి కుమార్, కరకగూడెం మండల కార్యదర్శి వంగర సతీష్, జిల్లా సమితి సభ్యులు సోందే కుటుంబరావు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్, గడ్డం మనోహరాచారి పత్తిపాటి నాగేశ్వరరావు, పేరాల శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు,మండల సహాయ కార్యదర్శి వేరుపుల నరేష్, పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్, చింతల దశరథం,ఎస్కే సర్వర్ కొడిమెల సుజాత,ఆధార్ కొత్తపల్లి సీతారాములు ఆదరణ సురేందర్ ,నోముల రవి ,బాడిస సతీష్, బోసెట్టి సంపత్, ముత్తయ్య, బోసెట్టి సంపత్, నియోజకవర్గ పట్టణ మండల కార్యవర్గ సభ్యులు కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిగా దగ్గుబాటి పేరు...



న్యూఢిల్లీ, జూలై 28, (న్యూస్ పల్స్) కేంద్ర విద్యా శాఖ మంత్రిగా ఉన్న ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. విద్యావ్యవస్థలో వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ ఆయన రాజీనామా చేశారు. ఇందులో యాదృచ్ఛికం ఏంటంటే.. స్వతహాగా విద్యార్థి నాయకుడిగా ఉండేవారు ధర్మేంద్ర ప్రధాన్. ఇప్పుడు అదే విద్యార్థి లోకం ఆందోళనల ఫలితంగా పదవికి దూరమయ్యారు. ఈ విషయాన్ని పక్కన పెడితే ఇప్పుడు తదుపరి కేంద్ర విద్యా శాఖ మంత్రి ఎవరు అనే చర్చ బలంగా నడుస్తోంది. అయితే ఈసారి సమర్థులకు అవకాశం ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోడీ భావిస్తున్నారు. క్యాబినెట్లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వాలని చూస్తున్నారు. అందులో భాగంగా ఏపీ నుంచి ఈసారి అవకాశం ఉంటుంది అనేది ప్రధానంగా జరుగుతున్న చర్చ. రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గతంలో ఆమె క్యాబినెట్లో పనిచేసిన అనుభవం ఉండడంతో ఆమె వైపు మోది మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంతో కేంద్ర ప్రభుత్వం ఇరకాటంలో పడింది. డ్యామేజ్ కంట్రోల్లో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ సైతం స్పందించారు. పేపర్ లీకేజీ ఘటనపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారం వ్యక్తం చేయడంతో పాటు పారదర్శకంగా ఇకనుంచి వ్యవహరిస్తామని కూడా చెప్పుకొచ్చారు. మరోవైపు జనతా కాక్రోచ్ ఉద్యమంతో దేశ అంతర్గత భద్రతకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. ఉద్యమం పక్కదారి పట్టి ఛాన్స్ అధికంగా ఉంది. ఈ ప్రమాదాన్ని ముందుగానే గుర్తించింది కేంద్ర ప్రభుత్వం. అందుకే విద్యా శాఖ మంత్రిగా ఉన్న ధర్మేంద్ర ప్రధాన్ తో రాజీనామా చేయించింది. అయితే తదుపరిగా ఈ బాధ్యతలు ఎవరు తీసుకుంటారు అనే ప్రశ్న వినిపించింది. అయితే ఆ అవకాశం ఏపీకి చెందిన మహిళ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి దక్కుతుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది.మూడోసారి ఎంపీ అయ్యారు దగ్గుబాటి పురందేశ్వరి. తెలుగుదేశం పార్టీ నాయకత్వంతో విభేదించి.. భర్త వెంకటేశ్వరరావు తో కలిసి పురందేశ్వరి 2004 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 2009లో రెండోసారి పోటీ చేసి గెలిచారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో కేంద్రమంత్రి పదవి చేపట్టారు. సమర్థవంతమైన నేతగా జాతీయస్థాయిలో గుర్తింపు పొందారు. 2014 ఎన్నికల కు ముందు అనూహ్యంగా భారతీయ జనతా పార్టీలో చేరారు. పొత్తులో భాగంగా ఆమె రాజంపేట నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2024 ఎన్నికల్లో రాజమండ్రి ఎంపీ స్థానానికి పోటీ చేసి విజయం సాధించారు. మంత్రివర్గంలో చోటు దక్కించుకోవాలని భావించారు. కానీ వివిధ సమీకరణలో దక్కలేదు. ఇప్పుడు పునర్వ్యవస్థీకరణలో ఆమెకు చాన్స్ దక్కుతుందని ప్రచారం జరిగింది. ఇంతవరకు మంత్రివర్గాన్ని విస్తరించలేదు మోడీ. ఇప్పుడు అనూహ్యంగా కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో పురందేశ్వరికి ఆ శాఖ ఇస్తారని తెలుస్తోంది. అయితే పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఇస్తారా? లేకుంటే ఇప్పుడే ఇస్తారా? అన్నది తెలియాల్సి ఉంది.

తెరపైకి మరో రెండు ఉద్యమాలు..

న్యూఢిల్లీ, జూలై 28, (న్యూస్ పల్స్)సుప్రీంకోర్టు న్యాయమూర్తి చేసిన కాక్రోచ్ వ్యాఖ్యల నుంచి పుట్టుకొచ్చిన కాక్రోచ్ జనతా పార్టీ ఇప్పుడు దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. మొన్నటి వరకు సోషల్ మీడియా వేదికగా ఉద్యమించిన సీజీపీ నీటి ప్రశ్నపత్రం లీకేజీ, విద్యా వ్యవస్థలో లోపల పై ప్రత్యక్ష ఆందోళన చేపట్టింది. ఏకంగా కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా లక్ష్యంగా ఢిల్లీలో జంతర్మంతర్ వద్ద నిరసనకు దిగింది. 20 రోజుల పైగా సాగిన ఉద్యమంతో విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఇదే స్ఫూర్తితో ఇప్పుడు మరో ఉద్యమం మొదలయ్యే అవకాశం కనిపిస్తుంది. ఇన్ స్టాగ్రామ్ లో అకస్మాత్తుగా పెరిగిన ఖీవబవతీలజీబితినీని ఊజీబిజీనీ ంనిటనీశ్రీజీని (ఖీఊం) యువత దృష్టిని ఆకర్షిస్తోంది. కుల ఆధారిత రిజర్వేషన్లో మార్పులు, మెరిట్, ఆర్థిక అవసరాల ఆధారంగా అవకాశాలు కావాలని కోరుతూ ఇది వేగంగా వ్యాపిస్తోంది. ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని స్పష్టం చేస్తూ, పౌరుల నేతృత్వంలోని ఉద్యమంగా తమను తాము రూపు దిద్దుకుంటోంది.ఇటీవలి విద్యార్థి నిరసనల (పరీక్షల లీక్లు వంటి సమస్యలపై) తర్వాత ఈ ఇన్ స్టాగ్రామ్ పేజీ ఫాలోయింగ్ అకస్మాత్తుగా పెరిగింది. కొన్ని గంటలు/రోజుల్లోనే లక్షల మంది ఫాలోవర్లను చేరుకోవడం వైరల్ అయింది. యూజర్ ప్రకారం 34 లక్షలకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. ఇది ప్రధానంగా జెన్ జెడ్, సాధారణ కేటగిరీ విద్యార్థుల మధ్య చర్చను రేకెత్తించింది. "సమానత్వం, మెరిట్, న్యాయం" వంటి నినాదాలతో ఇది ఆన్లైన్లో వేగంగా వ్యాపిస్తోంది.ప్రస్తుత కుల ఆధారిత కోటాలను (విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో) సమీక్షించాలని లేదా తొలగించాలని కోరుతూ, మెరిట్, నైపుణ్యం, ఆర్థిక అవసరాల ఆధారంగా అవకాశాలు కావాలని వాదిస్తోంది. కులం బదులు నిజమైన పేదరికం ఆధారంగా సహాయం, అధికారిక ఫారమ్లలో కుల ప్రకటనలు తగ్గించడం వంటి అంశాలు ముందుకు వస్తున్నాయి. ఒక తరం/కుటుంబానికి పరిమితం చేయడం లేదా క్రీమీ లేయర్ను మరింత కఠినంగా అమలు చేయడం వంటి సంస్కరణలు కూడా చర్చలో ఉన్నాయి.విద్యా అవకాశాల్లో అసమాన కట్-ఆఫ్లు, క్రీమీ లేయర్ సమస్యలు, కులం ఇంకా అధికారికంగా కొనసాగడం వంటి అంశాలపై యువతలో నిరాశ కనిపిస్తోంది. సోషల్ మీడియా ద్వారా త్వరగా వ్యాపించే సామర్థ్యం, రాజకీయ పార్టీల నుంచి దూరంగా ఉండాలనే ప్రకటన దీనికి ప్రాచుర్యం తెచ్చాయి. అయితే ఇలాంటి ఆన్లైన్ ఉద్యమాలు తరచూ భావోద్వేగంతో పెరుగుతాయి. నిజమైన సామాజిక మార్పుకు ఆఫ్లైన్ చర్చలు, విస్తృత సంప్రదింపులు అవసరం.రిజర్వేషన్ కుల స్నుహను కొనసాగిస్తుందని, మెరిట్ను బలహీనపరుస్తుందని, ఆర్థికంగా బాగా ఉన్నవారికి కూడా ప్రయోజనం చేకూరుస్తుందని అంటారు. ఆర్థిక ఆధారిత వ్యవస్థ మరింత సమానమని వాదిస్తున్నారు 1950ల నాటి వ్యవస్థను సమీక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే సమయంలో చారిత్రక అన్యాయాలు, నేటికీ కొనసాగుతున్న వివక్ష, ప్రాతినిధ్య అవసరం వంటి కారణాలతో రిజర్వేషన్ అవసరమన్న వాదన ఉంది. రిజరేషన్లు అకస్మాత్తుగా తొలగిస్తే అసమానతలు పెరగవచ్చని పేర్కొన్నారు. కులం ఆధారిత సమస్యలు పూర్తిగా అంతం కాలేదనే వాదన ఉంది. ఇంకోవైపు రెండు వైపులా చెల్లుబాటు అయ్యే అంశాలు ఉన్నాయి. రిజర్వేషన్ లక్ష్యం సామాజిక న్యాయం, కానీ అమలులో సమస్యలు, కాలక్రమేణా మార్పుల అవసరం.ఇలాంటి ఉద్యమాలు రాజకీయాల్లోకి లాగబడే ప్రమాదం ఉంది. రాజ్యాంగ సవరణలు, న్యాయస్థానాల పరిశీలన, విస్తృత సామాజిక సమ్మతి లేకుండా పెద్ద మార్పులు కష్టం. ఆర్థిక ప్రమాణాలను బలోపేతం చేయడం, విద్యా నాణ్యతను పెంచడం, క్రీమీ లేయర్ను సమర్థవంతంగా అమలు చేయడం వంటి మధ్యమార్గాలు ఎక్కువ చర్చనీయాంశాలు కావచ్చు.ఆర్ హెచ్ ఏ సోషల్ మీడియా ద్వారా యువతలోని నిరాశను ప్రతిబింబిస్తోంది. ఇది రిజర్వేషన్ విధానం గురించి తాజా చర్చను రేకెత్తించింది. అయితే నిజమైన పరిష్కారం ఒక పక్షం వాదనలపై కాకుండా, డేటా, సామాజిక వాస్తవాలు, రాజ్యాంగ సూత్రాల ఆధారంగా సమతుల్యమైన సంస్కరణల్లో ఉంటుంది.

తెరపైకి జెన్జీ క్యాబినెట్



అవకాశం తనకే అంటున్న అనిరుధ్ రెడ్డి

మహబూబ్ నగర్, జూలై 28, (న్యూస్ పల్స్)తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో త్వరలో జరగనున్న మంత్రివర్గ విస్తరణ, ప్రక్షాళన ఊహాగానాలతో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి కూడా రేసులోకి వచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై రెండున్నరేళ్లు పూర్తవుతున్న తరుణంలో, నూతనంగా విస్తరించే క్యాబినెట్లో తనలాంటి యువ ఎమ్మెల్యేలకు సముచిత స్థానం కల్పించాలని ఆయన అభిప్రాయపడ్డారు. పాలనలో కొత్త ఉత్సాహాన్ని నింపేందుకు యువ రక్తానికి మంత్రివర్గంలో చోటు కల్పించాల్సిన అవసరం ఉందనే చర్చ క్షేత్రస్థాయిలో నడుస్తోందని గుర్తుచేశారు. బహుశా జెన్ జీ ఉద్యమాలు జరుగుతున్నాయి కాబట్టి.. తనను జెన్ జీ ఖాతాలో వేసుకోవాలని ఆయన చెబుతున్నట్లుగా ఉంది.ప్రజాకాంక్షలకు అనుగుణంగా నూతన మంత్రివర్గ ఏర్పాటు జరగాలని ప్రజలు ఆశిస్తున్నారని అనిరుధ్ రెడ్డి తెలిపారు. క్షేత్రస్థాయిలో నిరంతరం ప్రజలతో మమేకమవుతూ, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడే యువ నాయకులను మంత్రులుగా చూడాలని తమ నియోజకవర్గాల ప్రజలతో పాటు రాష్ట్ర యువత కోరుకుంటోందని స్పష్టం చేశారు. పాలనలో మరింత వేగం పెంచేందుకు, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి సమర్థవంతంగా తీసుకెళ్లేందుకు యువ నాయకత్వం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.మంత్రివర్గ పదవుల కేటాయింపు మరియు విస్తరణ అనేది పూర్తిగా కాంగ్రెస్ అధిష్టానం, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిధిలోని అంశమని ఆయన స్పష్టం చేశారు. పార్టీ విజయం కోసం, ప్రభుత్వం బలోపేతం కోసం సీఎం రేవంత్ రెడ్డి మరియు ఏఐసీసీ నాయకత్వం ఏ నిర్ణయం తీసుకున్నా క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా, శాసనసభ్యుడిగా తాను దానికి సంపూర్ణంగా కట్టుబడి ఉంటానని తెలిపారు. అధిష్టానం ఇచ్చే ఏ బాధ్యతనైనా స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఇప్పటికే రెడ్డిసామాజికవర్గం నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో మల్ రెడ్డి రంగారెడ్డి, బోధన్ సుదర్శన్ రెడ్డితో పాటు చాలా మంది రేసులో ఉన్నారు. కొత్తగా అనిరుధ్ రెడ్డి కూడా రేసులోకి వచ్చారు.పంచాయతీ ఎన్నికల్లో సొంత ఊరులోనూ పార్టీని గెలిపించలేకపోయిన అనిరుధ్ రెడ్డి.. పవన్ కల్యాణ్ పై విమర్శలు చేయడానికి.. ఆంధ్రా సెంటిమెంట్ రెచ్చగొట్టడానికి వివాదాస్పద కామెంట్లు చేయడంలో మాత్రం ఎప్పుడూ ముందుంటారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో సంచలనాత్మక ప్రతిపాదనతో జాతీయ స్థాయిలో సరికొత్త రాజకీయ చర్చకు తెరలేపారు. ప్రస్తుతం లోక్సభ, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఉన్న కనీస వయస్సు పరిమితిని 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ నుంచి ఒక జాతీయ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఆగస్టు మొదటి వారంలో తెలంగాణ శాసనసభ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా రాజ్యాంగ సవరణ చేయాలని కోరుతూ ఏకగ్రీవ తీర్మానం ఆమోదిస్తామని ప్రకటించారు. 21 ఏళ్లకే చట్టసభల్లోకి అడుగుపెట్టడం ద్వారా జెన్-జీ' యువత ఐటీ, విద్యాశాఖల మంత్రులుగా, సీఎంలుగా, చివరకు ప్రధానిగా దేశాన్ని సమర్థవంతంగా నడపగలరని రేవంత్ రెడ్డి అభిప్రాయం.21 ఏళ్లకే పోటీ చేసే అవకాశం ఇవ్వడం వల్ల కలిగే అతిపెద్ద ప్రయోజనం.. చట్టసభల్లో యువతరానికి ప్రాతినిధ్యం పెరగడం. భారతదేశంలో జనాభాలో అత్యధిక శాతం ఉన్న యువత ఆకాంక్షలకు, వారి సమస్యలకు తగ్గట్లు విధాన నిర్ణయాలు రూపుదిద్దుకోవడానికి ఇది దోహదపడుతుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , స్టార్టప్లు, గ్రీన్ ఎనర్జీ, గిగ్ ఎకానమీ వంటి ఆధునిక అంశాలపై 21-25 ఏళ్ల యువతకు ఉన్నంత స్పష్టమైన అవగాహన, డిజిటల్ విజన్ వయోవృద్ధులైన సాంప్రదాయ రాజకీయ నాయకులకు ఉండకపోవచ్చు. అంతేకాకుండా, 18 ఏళ్లకే ఓటు హక్కు, ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత, పెళ్లిళ్లకు చట్టబద్ధత ఉన్నప్పుడు.. తమ నియోజకవర్గాన్ని ఏలే నాయకుడిని ఎన్నుకునే అర్హత ఉన్న యువతకు నేరుగా చట్టసభల్లోకి వెళ్లే హక్కు ఎందుకు ఉండకూడదనే వాదన అత్యంత సమంజసంగా అనిపిస్తుంది.నాణేనికి మరోవైపు చూస్తే ఇందులో కొన్ని తీవ్రమైన ప్రతికూలతలు కూడా ఉన్నాయి. 21 ఏళ్ల వయస్సు అనేది శారీరకంగా, మానసికంగా ఎదుగుతున్న కాలం. చట్టసభల్లో కోట్లాది రూపాయల బడ్జెట్ నిర్ణయాలు, సంక్లిష్టమైన చట్టాల రూపకల్పన, అడ్మినిస్ట్రేటివ్ ఒత్తిడిని తట్టుకోవడానికి రాజకీయ పరిణతి , అనుభవం అత్యంత అవసరం. ఈ వయస్సులో భావోద్వేగ నిర్ణయాలు ఎక్కువయ్యే ప్రమాదం ఉంది. మరో ముఖ్యాంశమేమిటంటే.. సాధారణ కుటుంబాల నుంచి వచ్చే 21 ఏళ్ల యువతకు ఎన్నికల ఖర్చులు, ప్రచారం తట్టుకోవడం అసాధ్యం. ఫలితంగా ఈ సడలింపు వల్ల నిజమైన సామాన్య యువత కంటే వంశపారంపర్య రాజకీయాలు మచేసే బడా నాయకుల పిల్లలు, వారసులు మరింత చిన్న వయస్సులోనే సులువుగా పదవులు ఆక్రమించేందుకు ఇది ఒక రెడ్ కార్పెట్ గా మారే ప్రమాదం ఉంది.ప్రపంచ వ్యాప్తంగా చూస్తే.. బ్రిటన్ , జర్మనీ, ఆస్ట్రేలియా వంటి అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో 18 లేదా 21 ఏళ్లకే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ఉంది. మన దేశంలో కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి ఇప్పటికే 21 ఏళ్ల వయోపరిమితి అమల్లో ఉంది. స్థానిక సంస్థల స్థాయిలో విజయవంతమైన ఈ మోడల్ను చట్టసభలకు విస్తరించడం ఒక రకంగా ప్రజాస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే అడుగు. అయితే, కేవలం వయస్సు తగ్గించడమే కాకుండా.. నేరమయ రాజకీయాలకు దూరంగా ఉండేలా, యువతలో సరైన నాయకత్వ లక్షణాలు, సమాజంపై అవగాహన పెంచేలా శిక్షణ ఇచ్చే వ్యవస్థలు కూడా ఏర్పడాల్సి ఉంది.

మహిళ నెంబర్ సోషల్ మీడియాలో పెట్టి?

రంగారెడ్డి,గతంలో జైలుకు వెళ్లి వచ్చినబుద్ధిమారలేదు డబ్బుల కోసం వక్రబుద్ధితో క్యాటరింగ్ పేరుతో టార్గెట్ చేస్తూ బూతుపురాణాన్ని వాడుతున్న యువకుడు, చివరకు కటకటాపాలైనాడు. సోషల్ మీడియాలో ఓ మహిళ డబ్బులు ఇవ్వడం లేదని ఆమె ఫోన్ నెంబర్ కాల్ గర్ల్ అని సోషల్ మీడియాలో అప్లోడ్ చేయడంతో మహిళ తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంది. బాధిత మహిళ ఆర్.జి.ఐ పిఎస్ ఆశ్రయించి ఇతనిపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు లోతుగా దర్యాప్తు చేసారు.డబ్బుల కోసం కస్టమర్లను ఫోన్లో తిట్టడమే కాదు. సోషల్ మీడియాలో కులపరంగా దూషించి పరువు తీసే ప్రయత్నం చేశాడు. చివరికి పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. క్యాటరింగ్ సిబ్బంది సరఫరా పేరుతో దందా చేసి, వివాదం వచ్చేసరికిదుర్భాషలకు దిగినట్లు గుర్తించారు.కులపరమైన దూషణలకు గురవుతున్నామంటూ బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.విచారణ అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు ముదిరాజ్ వన్నూరు స్వామి. మాసబ్ట్యాంక్, షాలిమార్ హోటల్ పక్కన, హైదరాబాద్. ఉంటూ డే పాస్ తీసుకొని రోజంతా తిరుగుతూ ఉంటాడు.

డివిజనల్ బెంచ్ కు సర్కార్..

హైదరాబాద్, జూలై 28 (న్యూస్ పల్స్)హైడ్రా కమిషనర్గా రంగనాథ్ను తొలగించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పుపై రంగనాథ్ స్పందించారు. తాము రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగానే పనిచేస్తున్నామని, చెరువులు, ప్రభుత్వ ఆస్తులను కాపాడటమే హైడ్రా ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. హైడ్రా ఇప్పటివరకు సుమారు రూ. 1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించి, వేల ఎకరాల భూములను వెనక్కి తీసుకుని ప్రభుత్వానికి అప్పగించిందని, ఇటీవల లోతుకుంటలో భూకబ్జా యత్నాన్ని కూడా అడ్డుకుందని తెలిపారు.ఆక్రమణల తొలగింపుతో పాటు ఇప్పటికే 6 చెరువులను పూర్తిస్థాయిలో పునరుద్ధరించామని, మరో 20 చెరువుల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ల్యాండ్ మాఫియా కోర్టులను తప్పుదోవ పట్టిస్తోందని, తనపై ఉన్న కోర్టు ధిక్కార కేసులన్నీ భూకబ్జాదారులు వేసినవేనని ఆరోపిస్తూ, న్యాయవ్యవస్థపై తనకు పూర్తి నమ్మకం ఉందని.. ఆ కేసులన్నింటినీ చట్టపరంగానే ఎదుర్కొంటానని ఆయన అన్నారు.హైడ్రా కమిషనర్గా రంగనాథ్ను తొలగించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇప్పుడు ప్రభుత్వం ఏం చేయబోతోందనే అంశంపైనే అందరి దృష్టి నెలకొంది. హైడ్రా కమిషనర్గా దాదాపు రెండేళ్ల నుంచి కొనసాగుతూ వచ్చిన రంగనాథ్ విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందనే విషయంలో నస్పెన్స్గా మారింది. అయితే హైకోర్టు ఆదేశాలపై ఆచితూచి స్పందించాలని ప్రభుత్వం నభావిస్తోంది. రంగనాథ్ విషయంలో వేచి చూసే ధోరణిలో ముందుకు సాగాలని యోచిస్తోంది. తీర్పునకు సంబంధించిన ఆర్డర్ కాపీ ఆధారంగా న్యాయసలహా తీసుకోవాలని డిసైడయ్యింది.ఇక ఈ విషయాన్ని ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు ఇంటలిజెన్స్ చీఫ్. దీనిపై న్యాయసలహా తీసుకోవాలని సీఎస్కు సీఎం రేవంత్ ఆదేశించినట్టు తెలుస్తోంది. ఇక హైడ్రాపై నమోదైన కోర్టు ధిక్కరణ కేసులపై సీఎస్ ఆరా తీస్తున్నట్టు సమాచారం. మరోవైపు ఈ కేసులో సింగిల్ బెంచ్ తీర్పుపై డివిజన్ బెంచ్లో అప్పీల్కు వెళ్లడంపై ప్రభుత్వం సమాలోచనలు జరుపుతున్నట్టు తెలుస్తోంది.

లీగల్ నోటీసులతో సీరి...

హైదరాబాద్, జూలై 28, (న్యూస్ పల్స్)తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మధ్య సాగుతున్న ప్రత్యక్ష పోరు సరికొత్త మలుపులు తిరుగుతోంది. ఇంటర్మీడియట్ మార్కుల వివాదంతో ముడిపడిన గ్లోబ్ఎరీనా సంస్థ కేటీఆర్దేనని, అది ఆయన బినామీ కంపెనీ అని సీఎం రేవంత్ రెడ్డి చేసిన సంచలన ఆరోపణలపై కేటీఆర్ మరోసారి లీగల్ నోటీసు అస్త్రాన్ని ప్రయోగించారు. 48 గంటల్లో బేషరతుగా క్షమాపణ చెప్పకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అయితే, రేవంత్ రెడ్డి విసురుతున్న తీవ్రమైన రాజకీయ ఆరోపణలను కేటీఆర్ మైదానంలో రాజకీయంగా తిప్పికొట్టకుండా, పదే పదే న్యాయస్థానాలు ,లీగల్ నోటీసుల వెనుక దాక్కుంటున్నారనే చర్చ తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్రంగా సాగుతోంది.గతాన్ని పరిశీలిస్తే కేటీఆర్ ఈ తరహా లీగల్ రూట్ను ఎంచుకోవడం ఇదే మొదటిసారి కాదు. గతంలో పీసీసీ చీఫ్గా ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి వైట్ ఛాలెంజ్ విసిరినప్పుడు , డ్రగ్స్ వ్యవహారంలో కేటీఆర్ను లక్ష్యంగా చేసుకున్నప్పుడు కూడా ఆయన రాజకీయ సభల్లో రేవంత్ను గట్టిగా దెబ్బతీయడం కంటే కోర్టుల్లో కేసులు వేయడానికే ప్రాధాన్యత ఇచ్చారు. ఫోన్ ట్యాపింగ్ వివాదం, బావమరిది ఫామ్హౌస్ రచ్చ, ఫార్ములా-ఈ రేస్ లీగల్ ప్రాసెస్, ఫోన్ ట్యాపింగ్ ఆరోపణల సమయంలోనూ పదుల సంఖ్యలో నాయకులకు లీగల్ నోటీసులు పంపారు. ఒక నాయకుడిగా తన ఇమేజ్ను కాపాడుకోవడానికి ఇది చట్టపరంగా సరైన మార్గమే అయినప్పటికీ, ప్రజాక్షేత్రంలో మాత్రం ఇది ఒక రకమైన రక్షణాత్మక శైలిగా కనిపిస్తోంది.రాజకీయాల్లో ఆరోపణలు వచ్చినప్పుడు ప్రజా క్షేత్రంలోనే వాటిని ఖండించాలి. రేవంత్ రెడ్డి ప్రజాదరణ పొందిన మాస్ లీడర్ శైలిలో ఘాటైన భాషతో, మీడియా వేదికలపై బహిరంగ దాడి చేస్తుంటే, కేటీఆర్ కూడా తన పద్ధతిలో కౌంటర్ ఇస్తున్నప్పటికీ అదనంగా కార్పొరేట్ పద్ధతిలో లీగల్ నోటీసుల కాగితాలను ముందుకు తెస్తున్నారు. రేవంత్ చేసే ప్రతి ఆరోపణకు మైక్ ముందుకు వచ్చి గంటల తరబడి ఆధారాలతో కౌంటర్ ఇవ్వకుండా, కేవలం లీగల్ టీమ్తో నోటీసులు పంపడం వల్ల.. కేటీఆర్ దగ్గర రాజకీయంగా రేవంత్ను ఢీకొట్టే కంటెంట్ లేదా పవర్ లేదా అనే సందేహం సామాన్య ప్రజల్లోకి వెళ్తోంది. ప్రజాస్వామ్యంలో కోర్టు నోటీసుల కంటే ప్రజా కోర్టులోనే నిజానిజాలు తేలాలనేది మెజారిటీ ఓటర్ల భావన. ఈ లీగల్ నోటీసుల స్ట్రాటజీ వల్ల రేవంత్ రెడ్డికి రాజకీయంగా మరింత మేలు జరుగుతోందనేది రాజకీయ విశ్లేషకుల అంచనా. కేటీఆర్ నోటీస్ ఇవ్వగానే.. నేను దేనికైనా సిద్ధం, విచారణ జరిపిస్తాం అని రేవంత్ రెడ్డి ఆ ఆరోపణలను మరింత గట్టిగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ఫలితంగా, గ్లోబ్ఎరీనా లేదా ఇతర ఆరోపణలు మీడియాలో రోజుల తరబడి నానుతూ, కేటీఆర్కు ప్రతికూల ప్రచారంగా మారుతున్నాయి. ఒక రకంగా కేటీఆర్ వంపే నోటీసులే రేవంత్ రెడ్డి ఆరోపణలకు మరింత వల్లినిటీ తెచ్చిపెడుతున్నాయనే నత్యాన్ని బీఆర్ఎస్ వ్యూహకర్తలు గుర్తించలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి.మాజీ మంత్రిగా, ఒక సమర్థవంతమైన పాలకుడిగా ఐటీ రంగాన్ని నడిపిన కేటీఆర్.. చట్టపరమైన ప్రక్రియల ద్వారా తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలనుకోవడం సాంకేతికంగా సరికావచ్చు. కానీ, తెలంగాణ వంటి హై-ఓల్టేజ్ రాజకీయాలు నడిచే రాష్ట్రంలో కార్పొరేట్ తరహా లీగల్ బెదిరింపులు పాలిటిక్స్లో పనిచేయవు. శత్రువు విసిరిన బాణాన్ని చట్టంతో కాకుండా, అంతకంటే పవర్ ఫుల్ పొలిటికల్ అస్త్రంతో తిప్పికొట్టినప్పుడే కేడర్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. రేవంత్ రెడ్డి లేవనెత్తుతున్న ప్రతి అంశంపై సభలు, సమావేశాలు పెట్టి ఆధారాలతో ప్రజాక్షేత్రంలోనే ఎండగట్టకపోతే.. ఆయనకు రాజకీయంగా రేవంత్ను ఎదుర్కొనే సత్తా తగ్గుతోందనే ప్రచారం నిజమేనని ప్రజలు నమ్మే ప్రమాదం ఉందని ఎక్కువ మంది భావిస్తున్నారు.

సంగం లక్ష్మీబాయి కాలేజ్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు

హైదరాబాద్ ఐ.ఎస్. సదన్లోని సంగం లక్ష్మీబాయి కాలేజ్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సంగం లక్ష్మీబాయి జయంతి సందర్భంగా పుస్తకాల పంపిణీ అంశం వివాదానికి దారితీయడంతో ఆందోళన చెలరేగింది. ఐ.ఎస్. సదన్లోని సంగం లక్ష్మీబాయి కాలేజ్లో సంగం లక్ష్మీబాయి జయంతి సందర్భంగా పుస్తకాల పంపిణీ విషయంలో వివాదం నెలకొంది. ఈ క్రమంలో మన ఆలోచన సాధన సమితి ఆధ్వర్యంలో కళాశాల ఎదుట ధర్నా చేపట్టారు. పుస్తకాల పంపిణీని అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ సమితి సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో కాలేజి పరిసరాల్లో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని ఇరు వర్గాలతో చర్చలు జరుపుతూ పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేసారు.

అనర్హులకు డబుల్ బెడ్ రూములు ఇస్తున్నారు

కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

హైదరాబాద్ జూలై 28, (న్యూస్ పల్స్) డబుల్ బెడ్ రూంలు నిరుపేదలకు ఇవ్వకుండా మంత్రుల కలెక్టర్ల అనుచరులను ఇవ్వడంపై కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మండిపడ్డారు. దేశంలో ప్రజలను నిత్యం మోసం చేసే పార్టీనే కాంగ్రెస్ పార్టీ అని ఆరోపించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం ఇండ్ల పంపిణీలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇష్టరాజ్యానికి పాల్పడుతోంది. ఖైతలాపూర్ లో కేసీఆర్ ప్రభుత్వంలో 145 డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించారు.నాలా పక్కన జీవిస్తున్న అమృత్ నగర్ తండా వాసులకు ఇవ్వాలని డిమాండ్ చేశాం. నిరుపేదలై విలేకరులకు ఇండ్లు ఇవ్వాలని కలెక్టర్ కి వినతిపత్రం అందించాం. హౌసింగ్ బోర్డు వీసీ తరుపున ఒకరికి డబుల్ బెడ్ ఇచ్చారు. హైదరాబాద్ రంగారెడ్డి కలెక్టర్ తరుపున మరొకరికి డబుల్ బెడ్ రూం. ఖమ్మం లో నివసిస్తున్న మహిళకు కూకట్ పల్లి లో డబుల్ బెడ్ రూం ఇచ్చారని అన్నారు.ఎండోన్మెంట్ కమిషనర్ తరుపున మరొకరికి డబుల్ బెడ్ ఇచ్చారు. కుత్బుల్లాపూర్ రెవిన్యూ డిపార్ట్మెంట్ లో పనిచేస్తున్న ప్రత్యూషకి డబుల్ బెడ్ రూం. పొన్నం ప్రభాకర్ పైరవీతో నరేష్ కుమార్ అనే వ్యక్తికి డబుల్ బెడ్ రూం ఇచ్చారు. మాజీ పిసిసి అధ్యక్షుడు డి శ్రీనివాస్ అల్లుడు శైలజ పేరుమీద మరొకరికి డబుల్ బెడ్ రూం, మంత్రులు కలెక్టర్లు లెటర్లు రాయడం డబుల్ బెడ్ రూములు కేటాయించడం ఇదేనా ప్రజా పాలన. కూకట్ పల్లి నిరుపేద ప్రజలకు డబుల్ బెడ్ రూం ఇవ్వాలని కేసీఆర్ ప్రభుత్వం ఇండ్లు కట్టింది.కనీస నిబంధనలు పాటించడం లేదు. ఎవరికి పడితే వారికి ఇష్టం వచ్చినట్లు అలాట్మెంట్ ఇస్తున్నారు..డబుల్ బెడ్ రూం ఇండ్లకోసం ఎలాంటి అప్లికేషన్ పెట్టుకొని వ్యక్తులకు కాంగ్రెస్ మంత్రులు ఇండ్లు ఇస్తున్నారు. అక్రమంగా లోపాయికారి తనంతో డబ్బులు గుంజుతూ పైరవీ లేఖలతో అమ్ముకుంటున్నారు.హైదరాబాద్ నగర ప్రజలకు లక్ష డబుల్ బెడ్ రూం ఇస్తామని ప్రజలను మోసం చేస్తున్నారు.అప్లికేషన్ పేరుమీద 10 వేల రూపాయలు కట్టించుకొని ప్రజలను మోసం చేస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం. అరులక్షల రూపాయలు కట్టితే ఇండ్లు కేటాయేస్తం అంటున్నారు. నిరుపేదలు అరులక్షల రూపాయలు కట్టుకొనే స్థోమత ఉంటుందా అని ప్రశ్నించారు.కెసిఆర్ ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూంలు కట్టించి ఒక్క రూపాయ తీసుకోకుంటా నిరుపేదలను ఇండ్లు అందించాం. మేడ్చల్ కలెక్టర్ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నిపక్షపాతంగా పనిచేస్తున్నారు. కాంగ్రెస్ ,బీజేపీ పార్టీలు ఒక్కరు కూడా డబుల్ బెడ్ రూం ఇండ్ల అవినీతిపై మాట్లాడారు. కాంగ్రెస్ మంత్రులు ఇష్టం వచ్చిన వాళ్లకు ఇండ్లను ఇస్తే హైకోర్టుని ఆశ్రయిస్తామని అయన అన్నారు.

దేశ రాజధాని ఢిల్లీలో కుంభవృష్టి.. ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్



దేశ రాజధాని ఢిల్లీ (లో కుండపోత వర్షం కురుస్తోంది. ఎగతెగకుండా కురుస్తున్న వర్షంతో ఢిల్లీ రహదారులు జలమయమయ్యాయి. పలుచోట్ల రోడ్లు నదులను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు తటాకాలుగా మారాయి. రోడ్లపై నీరు నిలువడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.రోడ్లపై వాన నీళ్లు నిలువడంతో పలు కూడళ్లలో ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దాంతో ఉద్యోగాలకు వెళ్లేవాళ్లు, కూలీలు, కార్మికులు, స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. ఇదిలావుంటే ఇప్పటికే ఢిల్లీ వాతావరణ శాఖ అధికారులు ఆరెంజ్ అలర్ట్ జారీచేశారు. రోజంతా వర్షం కురిసే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పంజాబ్ యూనివర్సిటీలో దారుణం..


విద్యుత్ షాక్‌తో పీహెచ్‌డీ విద్యార్థిని మృతి

పంజాబ్ రాజధాని చండీగఢ్‌లో దారుణం జరిగింది. పంజాబ్ యూనివర్సిటీలో విద్యుత్ షాక్‌తో 28 ఏళ్ల పీహెచ్‌డీ విద్యార్థిని మరణించింది. ఈ ఘటన పంజాబ్ యూనివర్సిటీ క్యాంపస్‌లోనే మంగళవారం ఉదయం జరిగింది. మృతురాలిని హరియాణాలోని రేవారికి చెందిన జ్యోతిగా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం జ్యోతి తన గల్స్ హాస్టల్ నుంచి మైక్రోబయాలజీ క్లాస్ కోసం బయల్దేరింది. అయితే, అక్కడ అక్కడ రోడ్డుపై, గోతుల్లో నీరు నిలిచింది.ఈ నీళ్లలో నడుస్తుండగా జ్యోతి విద్యుత్ షాక్‌కు గురై పడిపోయింది. ఇది గమనించిన తోటి విద్యా?ర్థులు వెంటనే స్పందించి, ఆమెను పక్కకు తీశారు. అనంతరం చికిత్స కోసం స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె మరణించినట్లు వైద్యులు తెలిపారు. ఉదయం నుంచి అక్కడ భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్డంతా నీటితో నిండిపోయింది. ఈ నీటిలోనే కరెంట్ షాక్‌కు గురైంది జ్యోతి. ఈ ఘటనపై పంజాబ్ యూనివర్సిటీ విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. యూనివర్సిటీ వీసీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. జ్యోతి మృతి ఘటనకు బాధ్యత వహించాలని, తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ ఆందోళన సందర్భంగా కొన్ని ఆస్తుల్ని కూడా విద్యార్థులు ధ్వంసం చేశారు.అయితే, ఈ నీళ్లలో కరెంట్ ఎలా ప్రసరించింది, ఆమెకు ఎందుకు కరెంట్ షాక్ తగిలింది అనే దానిపై ఇంకా స్పష్టత లేదు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ జరుపుతున్నారు. నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. పంజాబ్‌లోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. ఈ నేపథ్యంలో పంజాబ్‌తోపాటు చండీగఢ్‌కు ఐఎండీ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.



2 నెలల్లో పేపర్ లీకేజీ కేసుల దర్యాప్తు పూర్తి: కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ: పబ్లిక్ ఎగ్జామినేషన్స్ సవరణ బిల్లుపై ఇవాళ లోక్‌సభలో చర్చ మొదలైంది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడారు. పేపర్ లీకేజీ ఘటనల్లో కఠిన శిక్ష అమలు చేసేందుకు పేపర్ లీకేజీ నిరోధక బిల్లులో సవరణ చేపట్టినట్లు తెలిపారు. సెక్షన్ 10లోని సబ్‌సెక్షన్ 1 ప్రకారం లీకేజీ పాల్పడిన వ్యక్తికి 5 ఏళ్ల వరకు జైలుశిక్ష ఉండేది. ఆ కేసుల్లో పది లక్షల జరిమానా కూడా ఉంది. అయితే సవరణ ద్వారా జైలుశిక్షను 5 నుంచి పదేళ్లకు మార్చారు. జరిమానాను 50 లక్షలకు పెంచారు. 2024 చట్టం ప్రకారం సర్వీస్ ప్రొవైడర్‌కు కోటి జరిమానా ఇస్తున్నారు. ఆ ఫైన్‌ను ఇప్పుడు 5 కోట్లకు పెంచారు. పరీక్షల నిర్వహణ నుంచి గతంలో 4 ఏళ్ల వరకు తప్పించేవారు. ఇప్పుడు సవరణ ద్వారా ఆ సమయాన్ని 8 ఏళ్లకు పెంచారు.అయితే పేపర్ లీకేజీ కేసుల్లో వ్యవస్థీకృత నేరానికి పాల్పడే మాఫియాకు కూడా శిక్షా కాలాన్ని, జరిమానాను పెంచారు. గతంలో 5 నుంచి 10 వరకు ఉన్న జైలుశిక్షను ఇప్పుడు 7 నుంచి 10 ఏళ్ల వరకు పెంచారు. గతంలో ఆర్గనైజ్డ్ క్రైంకు పాల్పడితే కోటి జరిమానా విధించేవారు. ఇప్పుడు దాన్ని పది కోట్లకు సవరించినట్లు మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. వేగంగా న్యాయం అందించాలని ప్రధాని మోదీ చేసిన సూచన ప్రకారం.. స్పెషల్ టాస్క్ ఫోర్స్ కోర్టులను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వీటిల్లో బైం నిబంధన పెట్టినట్లు తెలుస్తోంది. కేంద్ర దర్యాప్తు సంస్థ అయినా లేక స్పెషల్ టాస్క్ ఫోర్స్ అయినా.. లీకేజీ కేసుల్లో దర్యాప్తును కేవలం 2 నెలల వ్యవధిలో పూర్తి చేయనున్నట్లు మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు.



అవసరమైతే మిమ్మల్ని కూడా వ్యతిరేకిస్తా.. రాహుల్ గాంధీతో జెన్ జీ నిరసనకారుడు ఇర్ఫాన్

న్యూఢిల్లీ: జంతర్ మంతర్ వద్ద జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ నిరసనల్లో రాజ్యాంగ పీఠికను చదివి సోషల్ మీడియాలో వైరల్ అయిన వీధి వ్యాపారి మహ్మద్ ఇర్ఫాన్‌ను.. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కలిశారు. ఈ సందర్భంగా రాహుల్‌కు ఇర్ఫాన్ నేరుగా తన అభిప్రాయాలను వెల్లడించారు. భవిష్యత్తులో అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోతే ఆయనకు వ్యతిరేకంగా కూడా ఉద్యమం చేస్తానని స్పష్టం చేశారు.తాను ఏ రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తిని కాదని, దేశ ప్రయోజనాలే తనకు ముఖ్యమని ఇర్ఫాన్ తెలిపారు. వలస కార్మికులు, రోజువారీ కూలీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాహుల్‌ను కోరినట్లు చెప్పారు. దేశంలో అందరికీ కనీస సౌకర్యాలు అందాలని, ఎవరూ వెనుకబడిపోకూడదని అభిప్రాయపడ్డారు. దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తోన్న రోజువారీ కూలీలు ఆర్థికంగా, మానసిక ఒత్తిడితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇర్ఫాన్ ఆవేదన వ్యక్తం చేశారు. వారికి కనీస వేతనం రూ.18 వేలుగా ఉన్నప్పటికీ, చాలామంది కార్మికులు 10-11 గంటలు పనిచేసి కూడా రూ.13-14 వేలే పొందుతున్నారని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థలోని లోపాలపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పదో తరగతి, ఇంటర్‌కు ముందే చదువు మానేస్తున్న విద్యార్థుల సంఖ్య పెరిగిపోతోందని, ఐటీఐలు, పాలిటెక్నిక్‌ల విద్య వంటి అవకాశాలు పేదలకు పూర్తిస్థాయిలో అందడం లేదని తెలిపారు.రాహుల్‌తో మాట్లాడుతుండగా ప్రియాంక గాంధీ ఫోన్ చేసిన విషయాన్ని కూడా ఇర్ఫాన్ వెల్లడించారు. రాహుల్‌ను పెళ్లి చేసుకోమ్మని తన తరఫున చెప్పాలని ప్రియాంక కోరగా, తాను మాత్రం రాహుల్ పెళ్లి చేసుకోకపోవడమే మంచిదని సరదాగా చెప్పినట్లు వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీని కలవడంపై కూడా ఇర్ఫాన్ స్పందించారు. ప్రధానిని కలవడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే ముందు కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిసి మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసుల నిర్లక్ష్యాన్ని ప్రస్తావించాలని ఉందని చెప్పారు. తమ ప్రాంతంలో చిన్న పిల్లలకే డ్రగ్స్ ఎక్కడ దొరుకుతాయో తెలుసని, కానీ పోలీసులకు మాత్రం తెలియకపోవడం ఆశ్చర్యంగా ఉందని వ్యాఖ్యానించారు.



కోర్టు వీడియోలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు.. అనుమతి లేకుండా పోస్టు చేస్తే చర్యలు



న్యూఢిల్లీ: కోర్టు విచారణల వీడియోలపై సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు వీడియోలను అనుమతి లేకుండా సోషల్ మీడియా, ఇతర డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ప్రసారం చేయడంపై కఠిన ఆంక్షలు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం.. కోర్టు విచారణలకు సంబంధించిన వీడియోలను ముందస్తు అనుమతి లేకుండా పోస్ట్ చేయడం, ఎడిట్ చేయడం, డౌన్‌లోడ్ చేయడం, తిరిగి షేర్ చేయడం (రీ-పోస్ట్), మానిటైజ్ చేయడం నిషేధం. కోర్టు రికార్డింగ్‌లను అనుమతి లేకుండా భద్రపరచడం లేదా ప్రసారం చేయడం కూడా నిబంధనల ఉల్లంఘనగా పరిగణించనుంది.అయితే, మీడియా సంస్థలకు మాత్రం కోర్టు కేసులపై రిపోర్టింగ్ చేయడంపై ఎలాంటి ఆంక్షలు ఉండవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గుర్తింపు పొందిన వార్తా సంస్థల రిపోర్టింగ్ హక్కులకు ఎలాంటి భంగం కలగదని పేర్కొంది. కోర్టు విచారణలకు సంబంధించిన వార్తలను మీడియా సంస్థలు యథావిధిగా ప్రజలకు అందించవచ్చని తెలిపింది.

హిమాచల్ ప్రదేశ్ చంబా జిల్లాలో ఘోర ప్రమాదం.. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురి మృతి..

హిమాచల్ ప్రదేశ్: చంబా జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఓ కారు ప్రమాదవశాత్తూ లోయలో పడి ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతిచెందారు. చనిపోయిన వారిలో ఏడాది వయసున్న చిన్నారి ఉండటం స్థానికుల హృదయాలను తీవ్రంగా కలచివేస్తోంది. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి భరమౌర్-పఠాన్‌కోట్ రహదారి లహోర్ సమీపంలో జరిగింది. చిన్నారి అనారోగ్యానికి గురికావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు బాధిత కుటుంబం పఠాన్‌కోట్‌కు కారులో బయలుదేరింది. చిన్నారి తల్లిదండ్రులు, తాతయ్య, అమ్మమ్మ కలిసి సోమవారం రాత్రి రోడ్డు మార్గాన బయలుదేరారు.అయితే, లహోర్ సమీపానికి రాగానే కారు ప్రమాదానికి గురైంది. ఒక్కసారిగా అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లడంతో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనకు కచ్చితమైన కారణాన్ని అధికారులు ఇంకా నిర్ధారించనప్పటికీ.. కారు నడుపుతున్న వ్యక్తి నియంత్రణ కోల్పోవడం వల్లే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. రాత్రి వేళ కావడంతో ప్రమాదాన్ని గుర్తించేందుకు చాలా సమయం పట్టింది. అనంతరం స్థానికుల సమాచారంతో పోలీసులు, వైద్య సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను వెలికితీసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.మరోవైపు, ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ప్రాణాలు కోల్పోవడంతో బంధువులు, గ్రామస్థులు తీవ్రగ్రాంతికి గురయ్యారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేశామని, కచ్చితమైన కారణాన్ని నిర్ధారించడానికి దర్యాప్తు కొనసాగుతోందని చంబా ఎస్పీ విజయ్ సక్లానీ తెలిపారు. అలాగే కొండ ప్రాంత రహదారులపై రాత్రివేళ, ప్రతికూల వాతావరణంలో అత్యంత జాగ్రత్తగా వాహనాలు నడపాలని జిల్లా ప్రజలకు ఆయన సూచించారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలని రోడ్డుపై బైఠాయించి ఆందోళన



కారేపల్లి, జూలై 28 : తరచుగా విద్యుత్ ప్రసారం నిలిచిపోవడంతో ఆగ్రహించిన ప్రజలు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టిన సంఘటన మంగళవారం ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని భాగ్యనగర్ తండా గ్రామంలో స్థల దాత సహాయంతో అధికారులు విద్యుత్ సబ్ స్టేషన్‌ను నిర్మించారు. ఆనాడు స్థల దాతకు అధికారులు ఇచ్చిన హామీని ఇంతవరకు అమలు చేయకపోవడంతో ఆగ్రహించిన ఆమె తరచుగా సబ్ స్టేషన్ లోకి చొరబడి విద్యుత్ ప్రసారాన్ని నిలిపివేస్తుంది. దీంతో కరెంట్ లేక ఇబ్బందులు పడుతున్న సబ్ స్టేషన్ పరిధిలో గల గ్రామాల ప్రజలు స్థానిక సర్పంచులతో కలిసి ఇల్లెందు-కారేపల్లి ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు.సుమారు రెండు గంటల పాటు జరిగిన ఆందోళనతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న తాసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, సీఐ నూనావత్ సాగర్, ఎస్ఐ బైరు గోపి విద్యుత్ అధికారులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించి విరమింపజేశారు. అనంతరం విద్యుత్ సబ్ స్టేషన్ నుండి కరెంట్ సరఫరాను పునరుద్ధరించారు. ఇప్పటికైనా తన సమస్యకు పరిష్కారం చూపించకపోతే మళ్లీ కరెంట్ సరఫరాను నిలిపివేస్తానని స్థల దాత హెచ్చరించడం కొసమెరుపు.

మిర్చి రైతుకు తప్పని తిప్పలు.. మార్కెట్ ఎదుట ఆత్మహత్యాయత్నం..

కాంగ్రెస్ హయాంలో రైతులు ఓ వైపు నీళ్ల కోసం ఎదురుచూపులు.. మరోవైపు పండించిన పంటకు గిట్టుబాటు ధరల కోసం వెతలు తప్పడం లేదు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్ద వడ్లు, మక్కలను అమ్ముకునేందుకు రైతులు నెలల తరబడి వేచి ఉండి తీవ్ర అవస్థలు పడ్డారని తెలిసిందే. ఈ బాధలు మిర్చి రైతులను కూడా చుట్టుముట్టాయి.వ్యవసాయ మార్కెట్ ఎదుట మిర్చి రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో చోటు చేసుకుంది. తాము అమ్మిన మిర్చి డబ్బులు చెల్లించాలని ఓ రైతన్న వ్యవసాయ మార్కెట్ ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో వెంటనే అప్రమత్తమైన తోటి రైతులు, మార్కెట్ చైర్మన్ సదరు రైతును అడ్డుకున్నారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి ఎలా ఉందో తెలియజేసేందుకు ఈ వీడియో మరోసారి ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తుంది.



కాక్రోచ్ జనతా పార్టీలో చీలిక..

మొహమ్మద్ జునైద్ సీజేపీని వీడబోతున్నారా

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) గురించి దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో పార్టీలో చీలిక వచ్చిందని, కీలక నేతల మధ్య విబేధాలు చోటుచేసుకున్నాయని ఒక ప్రచారం మొదలైంది. అయితే, ఈ ప్రచారంపై సీజేపీ కీలక నేత, వాలంటీర్ మొహమ్మద్ జునైద్ స్పందించారు. ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని, పార్టీలో చీలిక లేదని వెల్లడించారు. నేతలమధ్య ఎలాంటి విబేధాలు లేవన్నారు. మొహమ్మద్ జునైద్ సీజేపీలో కీలక వాలంటీర్‌గా ఉన్నారు.ఇటీవల ఢిల్లీలో జరిగిన ఆందోళన సందర్భంగా జునైద్ కమ్యూనిటీ కిచెన్ నిర్వహణ బాధ్యతలు చూసుకున్నారు. నిరసనల్లో పాల్గొన్నవారికి ఆహారం అందించాడు. సీజేపీకి మద్దతుగా భారీ ప్రచారం చేశారు. ఆందోళనల్లో పాల్గొన్నారు. దీంతో అతడికి మంచి గుర్తింపు దక్కింది. కానీ, ఇటీవల అతడికి సంబంధించి సోషల్ మీడియాలో ప్రచారం మొదలైంది. సీజేపీ ఫౌండర్ అభిజిత్ దీప్కేతోపాటు పార్టీలోని ఇతర నేతలతో అతడికి విబేధాలు చోటు చేసుకున్నాయని, ఈ నేపథ్యంలో జునైద్ సీజేపీని వీడుతారనే ప్రచారం మొదలైంది. ఇదే సమయంలో ఒక వీడియో కూడా గతంలో వైరల్ అవుతోంది. సీజేపీ తన నిరసన విరమించే ముందు తనను సంప్రదించలేదని వీడియోలో జునైద్ అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో జునైద్ పార్టీని వీడుతారని, పార్టీలో చీలిక అంటూ ప్రచారం ఊపందుకుంది.ఈ ప్రచారంపై జునైద్ స్పందించాడు. ఈ ప్రచారంలో ఎంతమాత్రం నిజం లేదన్నాడు. తాను సీజేపీని వీడటం లేదన్నాడు. తనను సీజేపీ నేతలు సమర్థిస్తున్నారని, వారి మద్దతు తనకు ఉందని వెల్లడించారు. తమ ఉద్యమాన్ని నీరుగార్చేందుకు కొందరు ఇలా దుష్ప్రచారం చేస్తున్నానరిన జునైద్ మండిపడ్డాడు. తమ పార్టీని దెబ్బతీసేందుకు ఉద్దేశపూర్వకంగా కుట్ర చేస్తున్నారని జునైద్ ఆరోపించాడు.



నిన్నే కర్నూలు.. ఇవాళే చిత్తూరు

రాయలసీమలో బంగారు గనులు



తిరుపతి, జూలై 28,కర్నూలు జిల్లా జొన్నగిరిలోని బంగారు గనిలో విజయవంతంగా బంగారం ఉత్పత్తి మొదలైంది. దీంతో రాష్ట్రంలో మరో భారీ బంగారు గని అభివృద్ధికి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది.. చిత్తూరు జిల్లా చిగురుగుంట-బి. సానత్తం బంగారు గనులను దక్కించుకునేందుకు ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) ఈ-వేలంలో పాల్గొనేందుకు సిద్ధమైంది. ఈ గనుల్లో సుమారు 22 లక్షల టన్నుల బంగారు ఖనిజ నిల్వలు ఉన్నట్లు అంచనా. మొత్తం 12,500 కిలోల వరకు బంగారం వెలికితీసే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ గనులను నేరుగా ఏపీఎండీసీకి రిజర్వ్ చేయాలని కేంద్రాన్ని కోరేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రయత్నాలు ప్రారంభించింది. కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇస్తే.. ఏపీకి ఆర్థికంగా భారీగా స్థాయిలో మేలు జరిగే అవకాశాల ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.చిగురుగుంట-బి సానత్తంలో 22లక్షల టన్నుల బంగారు ఖనిజ నిల్వలున్నట్లు అధికారులు గుర్తించారు. టన్ను ఖనిజాన్ని తవ్వితీసి శుద్ధి చేస్తే సగటున 5.64గ్రాముల బంగారం వస్తుందని అంచనా వేశారు. దీంతో ఈ గని నుంచి 12,500 కిలోల బంగారాన్ని వెలికితీయొచ్చునని అధికారులు భావిస్తున్నారు ఇక్కడ గతంలో భారత్ గోల్డ్ మైన్స్ ఆధ్వర్యంలో తవ్వకాలు జరిగాయి. 2001 సంవత్సరంలో తవ్వకాలను నిలిపివేశారు. 2018లో నిర్వహించిన ఈ-వేలంలో జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్ ఎండీసీ) వీటిని దక్కించుకుంది. అయితే, కొన్ని ఇబ్బందుల వల్ల లీజును వదలుకుంది. ప్రస్తుతం ఇక్కడి గనులకు టెండర్లు పిలిచారు. దీంతో ఏపీ ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఈ గనుల లీజును ఏపీఎండీసీ దక్కించుకొని బంగారం వెలికితీయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈనెలాఖరు వరకు బిడ్ల దాఖలుకు అవకాశం ఉండగా.. ఈ-వేలంలో పాల్గొనేందుకు ఏపీఎండీసీ సిద్ధమైంది.బంగారం, బొగ్గు, బాక్సైట్ వంటి మేజర్ మినరల్స్ ను వేలం ద్వారా కేటాయిస్తున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైనా వేలంలో పాల్గొని లీజులు పొందాల్సిందే. అయితే, ఇటీవల తెలంగాణ రాష్ట్రంలోని రెండు బొగ్గు బ్లాక్ లకు వేలం లేకుండా సింగరేణికి నేరుగా రిజర్వు చేశారు. ఒడిశాలోనూ ఓ బాక్సైట్ లీజును ఒడిశా ఖనిజాభివృద్ధి సంస్థకు కేటాయించారు. దీంతో చిగురుగుంట -బి సానత్తం గనులను వేలం లేకుండా ఏపీఎండీసీకి రిజర్వ్ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధమవుతోంది. కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇస్తే ఇక్కడి మైన్స్ ద్వారా ఏపీఎండీసీకి ఆర్థికంగా మేలు జరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

జెన్ జీ దిశగా జగన్ పార్టీ వ్యూహాలు

విజయవాడ, జూలై 28, జెన్ జీ పోరాటాలతో ప్రధాన్ రాజీనామా చేయడంతో అదే వ్యూహాన్ని ఆంధ్రప్రదేశ్‌లో పునరావృతం చేసేందుకు ప్రతిపక్ష వైసీపీ ప్రయత్నాలు ప్రారంభించింది. ఏపీ మెగా డీఎస్సీ నిర్వహణపై గతంలో చేసిన అక్రమాల ఆరోపణలనే మళ్లీ తెరపైకి తెస్తూ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలనే డిమాండ్‌ను వినిపిస్తోంది. పూర్తి పరీక్ష ప్రక్రియ ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా జరిగిందని ప్రభుత్వం స్పష్టం చేస్తున్నప్పటికీ, పేపర్ లీకేజీలు జరిగాయంటూ వైసీపీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.డీఎస్సీ ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ వేసిన పిటిషన్లలో న్యాయస్థానానికి కనీస ఆధారాలు కూడా సమర్పించలేక పిటిషనర్లు తమ దరఖాస్తులను ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. అయినప్పటికీ, జాతీయ స్థాయిలో నీట్ , ఇతర పరీక్షల వివాదాల ద్వారా పెల్లుబుకిన యువత ఆందోళనల తరహాలోనే, ఏపీలోనూ జెన్ జీ, నిరుద్యోగ యువతను ఏకం చేసి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచవచ్చని వైసీపీ వ్యూహరచన చేస్తోంది. సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన తరహా దీక్ష చేస్తే చాలు కదలిక వస్తుందని నమ్ముతున్నారు.వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రంగంలోకి దిగి ఆమరణదీక్షకు కూర్చోవాలంటూ ఆ పార్టీ అంతర్గత వర్గాలు సలహాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. డీఎస్సీలో ఉద్యోగాలు రాని లక్షలాది మంది దరఖాస్తుదారులు, వారి కుటుంబాలు ఈ దీక్షకు మద్దతుగా కదిలివస్తే, అది రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మారుతుందని పార్టీ అంచనా వేస్తోంది. కేడర్‌లో కొత్త ఉత్సాహం నింపడానికి , ప్రతిపక్షంగా నిలబడటానికి ఇలాంటి ప్రత్యక్ష పోరాటమే ఏకైక మార్గమని భావిస్తున్నారు. గతంలో తాము కాక్రోచ్‌లమని జగన్ ప్రకటించుకున్నారు. కానీ కాక్రోచ్‌లకు మద్దతు ప్రకటించలేదు. కనీసం వారి తరహాలో దీక్ష అయినా చేయాలని పార్టీ నేతలు కోరుకుంటున్నారు. ఆన్‌లైన్ పరీక్షల పారదర్శకతపై న్యాయపరంగా , సాంకేతికంగా బలమైన ఆధారాలు లేకపోయినా నిరుద్యోగ సమస్యను రాజకీయ అస్త్రంగా మలచుకోవాలనే వైసీపీ ఆకాంక్ష స్పష్టంగా కనిపిస్తోంది. మరి పార్టీ నేతల సలహాల మేరకు జగన్ ఆమరణదీక్ష అనే రిస్క్‌తో కూడిన నిర్ణయాన్ని తీసుకుని ధైర్యం చూపుతారా, లేక యథావిధిగా మీడియా ప్రకటనలు, ప్రెస్ మీట్లకే పరిమితమవుతారా అనేది రానున్న రోజుల్లో తేలనుంది.

మండలి రేసులో ఆ నలుగురు

విజయవాడ, జూలై 28, ఆంధ్రప్రదేశ్‌లోఖాళీగా ఉన్న గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల భర్తీపై అధికార కూటమి ప్రభుత్వం కసరత్తును అత్యంత ముమ్మరం చేసింది. రాష్ట్ర శాసనమండలిలో ఖాళీ అవుతున్న ఈ నామినేటెడ్ స్థానాలను భర్తీ చేసేందుకు వీలుగా ప్రభుత్వ పెద్దలు ఇప్పటికే అర్హులైన అభ్యర్థుల పేర్లపై సుదీర్ఘంగా చర్చలు జరుపుతున్నారు. సుదీర్ఘ కాలంగా పార్టీకి నమ్మకంగా సేవలు అందిస్తూ, గత ఎన్నికల్లో రాజకీయ సమీకరణాల వల్ల అవకాశాలు కోల్పోయిన సీనియర్ నాయకులతో కూడిన తుది జాబితాను సిద్ధం చేసే పనిలో టీడీపీ అధిష్టానం నిమగ్నమైంది.ప్రస్తుతం ఈ ఎమ్మెల్సీ రేసులో తెలుగుదేశం పార్టీ కి చెందిన పలువురు హేమాహేమీల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. అందులో ముఖ్యంగా టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి వర్ల రామయ్య, రాయలసీమకు చెందిన సీనియర్ నేత, కడప జిల్లా అధ్యక్షుడు రెడ్డప్పగారి శ్రీనివాసులురెడ్డి, కొమ్మాలపాటి శ్రీధర్, మరియు కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి పేర్లు ప్రధానంగా ప్రచారంలో ఉన్నాయి. గతంలో రాజ్యసభ స్థానాలను ఆశించి భంగపడిన వర్ల రామయ్య వంటి నేతలకు ఈసారి ఖచ్చితంగా అవకాశం కల్పించి శాసనమండలికి పంపాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం.వీరితో పాటు మాజీ ఎమ్మెల్యేలు వంగవీటి రాధాకృష్ణ, దేవినేని ఉమామహేశ్వరరావు పిఠాపురం వర్మ కూడా రేసులో నిలిచారు. శాసనమండలిలో డిప్యూటీ ఛైర్మన్ మేయానా జాకియా ఖానం, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబుల పదవీకాలం ముగియడంతో ఏర్పడిన ఈ ఖాళీలను భర్తీ చేయడం ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి ప్రతిష్టాత్మకంగా మారింది. ఒకవైపు సామాజిక సమీకరణాల లెక్కలు చూస్తూనే, మరోవైపు ప్రాంతీయ సమతుల్యత దెబ్బతినకుండా ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తున్నారు.ముఖ్యంగా దళిత, బీసీ మరియు మైనారిటీ సామాజిక వర్గాలకు ఈ పదవుల్లో సముచిత స్థానం కల్పించే దిశగా కసరత్తు సాగుతోంది. గవర్నర్ కోటా కింద భర్తీ చేసే ఈ అత్యున్నత స్థానాలకు సంబంధించిన అధికారిక ప్రకటన నేడు రాజ్‌భవన్ నుండి వెలువడే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం అందుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని రాష్ట్ర మంత్రివర్గం సిఫారసు చేసిన అభ్యర్థుల జాబితాకు గవర్నర్ ఆమోద ముద్ర వేసిన వెంటనే అధికారిక నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఎవరికి ఏ పదవి దక్కుతుందనే దానిపై అమరావతి రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ క్లైమాక్స్‌కు చేరింది.విజయవాడ రాజకీయం ఎప్పుడూ రసవత్తరంగానే ఉంటుంది. ముఖ్యంగా వంగవీటి కుటుంబానికి ఇక్కడ ఉన్న క్రేజ్, ఫాలోయింగ్ ఎలాంటిదో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. గడిచిన ఎన్నికల్లో వంగవీటి రాధాకృష్ణను ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దింపాలని తెలుగుదేశం పార్టీ అధిష్టానం శతవిధాలా ప్రయత్నించింది. మచిలీపట్నం ఎంపీ సీటుతో పాటు ఇతర అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు పలు ఆకర్షణీయమైన ఆఫర్లను ఇచ్చింది. అయినప్పటికీ, రాధా మాత్రం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం నుంచి మాత్రమే పోటీ చేయడానికి ఆసక్తి చూపించారు. అక్కడ అప్పటికే నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యేగా ఉండి.. స్వల్ప తేడాతో ఓడిపోయిన బొండా ఉమామహేశ్వరరావు ఉండటంతో.. పార్టీ ప్రయోజనాల దృష్ట్యా బొండాను కాదనలేక, రాధా సైలెంట్ అయ్యి పోటీకి దూరంగా ఉండిపోయారు.తెలుగుదేశం పార్టీకి, వంగవీటి రాధాకు కాగల కార్యాన్ని ఇప్పుడు బొండా ఉమనే స్వయంగా నెరవేరుస్తున్నారు ఇటీవల గుంటూరు సభ వివాదం, వైఎస్ఆర్‌సీపీ నేతలతో ఒకే వేదికను పంచుకోవడం, నియోజకవర్గంలో తలెత్తిన కొన్ని అంతర్గత వివాదాల కారణంగా బొండా ఉమ గ్రాఫ్ క్రమంగా తగ్గుతోందనే టాక్ వినిపిస్తోంది. అధిష్టానం దృష్టిలో ఆయనపై నమ్మకం సడలడం, వివాదాస్పద అంశాల్లో ఇరుక్కోవడంతో బొండా స్థానం ఇరకాటంలో పడింది. ఏ మాటకు ఆ మాటే చెప్పుకోవాలి.. విజయవాడ సెంట్రల్ పరిధిలో వంగవీటి కుటుంబానికి ఉన్న మాస్ ఇమేజ్, వర్గీకరణలకు అతీతంగా ఉన్న అభిమానం ముందర, రాధా ప్రత్యక్ష బరిలో నిలబడితే ప్రత్యర్థి ఎవరైనా సరే గెలుపు సాధించడం అసాధ్యమనేది బహిరంగ రహస్యమే.ఇన్నాళ్లూ సెంట్రల్ నియోజకవర్గం సీటు విషయంలో బొండా ఉమ అడ్డుగోడగా ఉన్నారని భావించిన వారికి, ఇప్పుడు ఆయన స్వయంకృతాపరాధాలు, మారిన రాజకీయ సమీకరణలు సరికొత్త అవకాశాన్ని ఇస్తున్నట్లు కనిపిస్తోంది. అధిష్టానం కూడా సెంట్రల్‌లో ప్రత్యామ్నాయ నాయకత్వం వైపు లేదా క్లీన్ ఇమేజ్ ఉన్న బలమైన నేత వైపు మొగ్గు చూపే పరిస్థితిని బొండా ఉమనే స్వయంగా కల్పించినట్లయింది. పార్టీ కోసం, నియోజకవర్గంలో మళ్లీ తిరుగులేని ఆధిపత్యం కోసం రాధా లాంటి మాస్ లీడర్‌ను రంగంలోకి దింపితే తిరుగుండదనే భావన టీడీపీ క్యాడర్‌లోనూ వ్యక్తమవుతోంది. రాధా పోటీ చేసేందుకు ఉన్న ఏకైక అడ్డంకి తొలగిపోయినట్లేనని, వచ్చే ఎన్నికలు లేదా పొలిటికల్ రీ-ఆర్గనైజేషన్ నాటికి విజయవాడ సెంట్రల్ నుంచి వంగవీటి రాధాకృష్ణ పోటీకి మార్గం సుగమం అవుతుందని భావిస్తున్నారు

బాధ్యతలు తీసుకుంటామంటున్న 36 వేల మంది

జనసేనలో సునామీ దరఖాస్తులు

జనసేన పార్టీ

కాకినాడ, జూలై 28, ఆంధ్రప్రదేశ్ రాజకీయంలో జనసేనాని, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన శైలిని వేగంగా మార్చుకుంటూ పరిపూర్ణ రాజకీయ నాయకుడిగా రూపాంతరం చెందుతున్నారు. గతంలో కేవలం ఎన్నికల సమయానికే పరిమితమవుతారనే విమర్శలకు చెక్ పెడుతూ, లభించిన అధికారాన్ని పార్టీ క్షేత్రస్థాయి విస్తరణకు అత్యంత వ్యూహాత్మకంగా వాడుకుంటున్నారు. అధికారంలో భాగస్వామిగా ఉన్న సమయాన్నే పార్టీని కేడర్ బేస్డ్ వ్యవస్థగా మార్చేందుకు ఆయన వేస్తున్న అడుగులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అందులో భాగమే రాష్ట్రవ్యాప్తంగా వివిధ స్థాయిల నాయకత్వ బాధ్యతల కోసం జనసైనికులు, వీరమహిళలు, క్రియాశీలక కార్యకర్తల నుంచి ఆహ్వానించిన దరఖాస్తుల ప్రక్రియ. ఏకంగా 36,000కు పైగా అప్లికేషన్లు వెల్లువెత్తడం జనసేన పార్టీ పెరుగుతున్న రాజకీయ గ్రాఫ్‌కు నిదర్శనంగా మారింది.ఈ భారీ స్పందన నుంచి కేవలం గుడ్డిగా నియామకాలు చేయకుండా, వడపోత ద్వారా నిఖార్సైన, సిద్ధాంత ప్రాతిపదికన పనిచేసే సైనికులను ఎంపిక చేసే పనిలో పవన్ పడ్డారు. పంచాయతీ నుంచి అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయి వరకు బలమైన కమిటీలను నిర్మించడం ద్వారా, స్థానిక సంస్థల ఎన్నికల నాటికి గ్రామీణ స్థాయిలో జనసేనకు తిరుగులేని పునాది వేయడమే ఆయన ప్రధాన లక్ష్యం. డిప్యూటీ సీఎంగా గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ వంటి కీలక శాఖలు తన వద్దే ఉండటం పవన్‌కు మరో పెద్ద ప్లస్ పాయింట్. పాలనలో తన ముద్ర వేస్తూనే, కేడర్‌కు పనులు చేసి పెట్టే అవకాశాన్ని ఆయన సమర్థవంతంగా వినియోగించుకుంటున్నారు.కూటమిలో ప్రస్తుతం తక్కువ సీట్లతో చిన్న భాగస్వామిగా ఉన్నప్పటికీ, భవిష్యత్తులో తన వాటాను సమానంగా లేదా అంతకంటే ఎక్కువ స్థాయిలో క్లెయిమ్ చేసేందుకు పవన్ నిరంతరం శ్రమిస్తున్నారు. ఓటు బ్యాంకు మార్పిడిని ఎన్నికల్లో నిరూపించిన ఆయన, ఇప్పుడు సంస్థాగత బలం ద్వారా కూటమిలోనే అత్యంత డిమాండింగ్ ఫోర్స్‌గా మారాలని చూస్తున్నారు. రాజకీయంలో ఏ పార్టీ కూడా శాశ్వతంగా రెండో స్థానంలో ఉండటానికి ఇష్టపడదు. పవన్ కళ్యాణ్ సుదూర వ్యూహం కూడా జనసేనను ఏపీలో ప్రధాన రాజకీయ శక్తిగా నిలబెట్టడమే అనడంలో ఎలాంటి సందేహం లేదు. జనసేన పుంజుకుంటున్న ఈ వేగం అంతిమంగా మిత్రపక్షమైన తెలుగుదేశం పార్టీకి సాంకేతికంగా పెద్ద సవాలుగానే మారే అవకాశముంది. దశాబ్దాలుగా బలమైన గ్రాస్‌రూట్ నెట్‌వర్క్ ఉన్న టీడీపీకి, అదే క్షేత్రస్థాయిలో జనసేన పోటీదారుగా మారడం భవిష్యత్ ఎన్నికల్లో సీట్ల పంపిణీపై తీవ్ర ప్రభావం చూపుతుంది. గతంలో టీడీపీకి ఏకపక్షంగా ఉన్న కొన్ని వర్గాల ఓటు బ్యాంకు, ఇప్పుడు జనసేన వైపు బలంగా మొగ్గుతుండటం మేజర్ పార్టీగా ఉన్న టీడీపీకి అంతర్గతంగా కొంత ఆందోళన కలిగించే అంశమే.ఈ రాజకీయ పరిణామాలకు టీడీపీ కూడా ఊరికే ప్రేక్షకపాత్ర వహించే అవకాశం లేదు. పవన్ కళ్యాణ్ అడుగులకు చెక్ పెట్టడానికి లేదా తమ ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి చంద్రబాబు నాయుడు తనదైన రీతిలో వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఒకవైపు కూటమి ధర్మాన్ని పాటిస్తూనే, మరోవైపు తమ శ్రేణులను కాపాడుకునేందుకు సభ్యత్వ నమోదు, నియోజకవర్గ స్థాయి ఇన్‌ఛార్జుల మార్పులు, కార్యకర్తలకు ప్రభుత్వ పథకాల నామినేటెడ్ పదవుల కేటాయింపు వంటి చర్యలను టీడీపీ వేగవంతం చేస్తోంది. జనసేన ఎంతగా బలపడినా, కూటమిలో పెద్దన్న పాత్ర ఎప్పటికీ తమదేనని నిరూపించేలా పాలనాపరమైన మైలేజీని క్రెడిట్ చేసుకునే పనిలో పచ్చజెండా ఉంది.కూటమి ఐక్యత పైన కనిపిస్తున్నప్పటికీ.. లోపల మాత్రం టీడీపీ, జనసేనల మధ్య సంస్థాగత బలాన్ని పెంచుకునే రహస్య పోటీ అత్యంత ఆసక్తికరంగా సాగుతోంది. పవన్ కళ్యాణ్ వేస్తున్న పక్కా పొలిటికల్ స్కెచ్‌లు జనసేనను కొత్త శిఖరాలకు తీసుకెళ్తాయా? లేక చంద్రబాబు చదరంగపు ఎత్తుల ముందు సానుకూల రాజకీయాలకే పరిమితమవుతాయా అనేది రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో తేలిపోనుంది.

ఢిల్లీ పర్యటనపై జగన్ మైండ్ గేమ్



విజయవాడ, జూలై 28, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేయబోతున్నట్లుగా ప్రచారం జరుగుతున్న ఢిల్లీ పర్యటన , ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాల అపాయింట్‌మెంట్‌లు ఎప్పుడూ అత్యంత ఆసక్తికరమైన రాజకీయ చర్చలకు దారితీస్తున్నాయి. ఇంత వరకూ అపాయింట్ మెంట్ ఖరారైనట్లుగా స్పష్టత లేదు కానీ.. భేటీ ఉంటుందని వైఎస్ఆర్‌సీపీ వర్గాలంటున్నాయి. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా.. కేంద్ర పెద్దలకు తమపైనే ప్రత్యేక అభిమానం ఉందనే సంకేతాలను కేడర్‌లోకి పంపడంలో వైఎస్సార్‌సీపీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ వస్తోంది. క్షేత్రస్థాయి ప్రచారంలో టీడీపీ, జనసేనలతో బీజేపీ, కేవలం ఎన్నికల పొత్తు మాత్రమే పెట్టుకుంది, కానీ మోదీ-షాలకు జగన్ అంటేనే ప్రత్యేక ఇష్టం అనే భావనను నిలబెట్టే ప్రయత్నం నిరంతరం సాగుతుంటుంది. కూటమి ప్రభుత్వంపై ఫిర్యాదు చేసేందుకు జగన్‌కు మోదీ-షాలు అపాయింట్‌మెంట్ ఇస్తే ఏపీ రాజకీయ సమీకరణాలు ఎలా మారుతాయనేది ఆసక్తికరంగా మారింది.వైఎస్సార్‌సీపీ వ్యూహాన్ని లోతుగా పరిశీలిస్తే.. ఢిల్లీలో కేంద్ర పెద్దల భేటీ లభిస్తే దాన్ని వెంటనే కూటమిపై మైండ్ గేమ్ ఆడేందుకు ఉపయోగించుకుంటుంది. తమ నేతపై కేంద్ర దర్యాప్తు సంస్థల కదలికలు మందగించడానికి, కూటమి ప్రభుత్వం పగటిపూట చేసే విచారణలకు కేంద్రం వద్ద మద్దతు లభించడం లేదని నిరూపించడానికి ఈ అపాయింట్‌మెంట్‌ను ఒక రుజువుగా చూపే అవకాశం ఉంది. జగన్ విజ్ఞప్తులను వినడానికి ప్రధాని లేదా హోంశాఖ మంత్రి సమయం కేటాయిస్తే.. చూశారా! కూటమి ఎన్ని ఆరోపణలు చేసినా కేంద్రం జగన్ మాటకే ప్రాధాన్యం ఇస్తోంది అని క్షేత్రస్థాయిలో జోరుగా ప్రచారం చేసుకోవడం ద్వారా సొంత కేడర్‌లో ధైర్యం నూరిపోసేందుకు వైసీపీకి అవకాశం లభిస్తుంది. ఇక కూటమి పరంగా చూస్తే.. ప్రధాని లేదా హోంశాఖ మంత్రి జగన్‌కు ముఖాముఖి సమయం ఇవ్వడం కూటమి శ్రేణుల్లో సాంకేతికంగా కొంత గందరగోళాన్ని సృష్టించే ముప్పు ఉందనేది కొట్టిపారేయలేని నిజం. ముఖ్యంగా టీడీపీ, జనసేన శ్రేణులు సుదీర్ఘ పోరాటం చేసి సాధించిన చారిత్రాత్మక విజయం తర్వాత, వైసీపీ శ్రేణులకు అంతర్గతంగా పొందే ఒక నైతిక విజయం గా ఇది రూపాంతరం చెందే ప్రమాదం ఉంది. కూటమి ప్రభుత్వం చేపడుతున్న విచారణలు, అరెస్టులపై జగన్ ఇచ్చే వినతిపత్రాలు ఢిల్లీ స్థాయిలో చర్చనీయాంశమైతే, అది కూటమి ఐక్యత , ప్రభుత్వ ఇమేజ్‌పై స్వల్ప ప్రభావం చూపవచ్చనే ఆందోళన స్థానిక నేతల్లో వ్యక్తమవుతుంటుంది. ఢిల్లీ రాజకీయాల యంత్రాంగాన్ని డీకోడ్ చేస్తే.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అగ్రనాయకత్వం నరేంద్ర మోదీ, అమిత్ షాలు అంత సులభంగా విపక్షాల ట్రాప్‌లో పడే అవకాశాలు లేవని స్పష్టమవుతోంది. రాజకీయ వ్యూహకర్తగా అమిత్ షా వైఖరి ఎప్పుడూ స్పష్టంగా ఉంటుంది. ప్రాంతీయ పార్టీల అంతర్గత కలహాల్లో దూరి తమ మిత్రపక్షాలకు ఇబ్బంది కలిగించే రాజకీయాలకు వారు దూరంగా ఉంటారు. ప్రస్తుతం ఏపీలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అత్యంత బలమైన మెజారిటీతో, చంద్రబాబు సీఎంగా, పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎంగా సుస్థిర పాలన అందిస్తోంది. ఇటువంటి సమయంలో కూటమి ఐక్యతకు హాని కలిగించే లేదా మిత్రపక్షాల్లో అనుమానాలు రేకెత్తించే సంకేతాలను అధిష్టానం ఇవ్వాలనుకోదు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక రాష్ట్రానికి చెందిన ప్రధాన ప్రతిపక్ష నాయకుడు లేదా మాజీ ముఖ్యమంత్రి సమయం కోరినప్పుడు, నిబంధనల ప్రకారం లేదా సాధారణ ప్రోటోకాల్ ప్రకారం వినతిపత్రాలు స్వీకరించడం కేంద్ర మంత్రుల విధి.

వైసీపీ సీనియర్లలో అసంతృప్తులు

నెల్లూరు, జూలై 28,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎటు వెళ్తుందో తెలియడం లేదు. ఆ పార్టీ సీనియర్లలో ఆందోళన అదే. ప్రజా పోరాటాలు చేయడం లేదు. ప్రజా ఆందోళనలు నిర్వహించడం లేదు.. జాతీయస్థాయిలో జరుగుతున్న పెద్ద ఉద్యమాలకు మద్దతు తెలపడం లేదు. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు చుట్టూ వివాదాలు, కేసులు నడుస్తున్నాయి. అలాగని గత ప్రభుత్వ హయాంలో జరిగిన కేసులు కావు. ఇందులో నేరుగా కూటమి ప్రభుత్వం కలుగజేసుకోవడం లేదు. కానీ ఒక్క వైసీపీ నేతపై కేసు నమోదు అవుతుంది. అరెస్టుల పర్వం నడుస్తోంది. దీనిపైనే వైసీపీలో సీనియర్లు ఆందోళన చెందుతున్నారు. వ్యక్తిగత వ్యవహార శైలితో పార్టీని కొంతమంది నేతలు డ్యామేజ్ చేస్తున్నారన్న ఆందోళన వారిలో కనిపిస్తోంది. ఇది పార్టీ పై ప్రతికూలత చూపుతోందన్న ఆవేదన సీనియర్లలో ఉంది. ఇన్ని రోజులు అధినేత జగన్మోహన్ రెడ్డి ఏం చేసినా ఊరుకున్నామని.. ఇకనుంచి ఊరుకోబోమని వారు చెబుతున్నారు. హెచ్చరించినంత పని చేస్తున్నారు.కొద్ది రోజుల కిందట సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. పార్టీలోనే పవర్ఫుల్ నేత ఆయన. మరి ఎందుకు ఆ స్థాయిలో మాట్లాడడం లేదు అని రిపోర్టర్ ప్రశ్నించేసరికి పెద్దిరెడ్డి వింత సమాధానం చెప్పారు. తమ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై ఆవేదనతో సంకేతాలు ఇచ్చారు. రాజకీయాల్లో హుందాతనం ఉండాలని.. తాను అటువంటిదే కోరుకుంటానని.. తమ పార్టీ నేత అంబటి రాంబాబు లా మాట్లాడను అంటూ చురకలు అంటించారు. అయితే అది అంబటి రాంబాబు నువ్వు ఉద్దేశించింది కాదు. తెర వెనుక జగన్ వైఖరిని తప్పు పట్టడమే దాని ముఖ్య ఉద్దేశం. ఒక్క పెద్దిరెడ్డి మాత్రమే కాదు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు లాంటి సీనియర్ నేతలు వైసీపీలో అనవసర వ్యాఖ్యలు చేసే నాయకుల వైఖరిని తప్పుపడుతున్నట్లు తెలుస్తోంది.మొన్నటి వరకు కూటమి ప్రభుత్వం పాత కేసులను తెరపైకి తెచ్చి వెంటాడింది అని వైసిపి ఆరోపించింది. కానీ ఇప్పుడు ఒక్కో నేత అరెస్టు తీరు చూస్తే మాత్రం భిన్నంగా ఉంది. కేసులు నమోదు కావడం వెనుక చూస్తుంటే వ్యక్తిగత వ్యవహార శైలి కనిపిస్తోంది. మాజీ మంత్రి అప్పలరాజు వ్యవహరించిన తీరుతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయి. తన కుమారుడు బైక్ రైటింగ్ కారణంగా ఓ మనిషి ప్రమాదానికి గురయ్యారు. కానీ అది తన కొడుకు మెడకు చుట్టుకోకుండా మరో వ్యక్తిని బలిపశువు చేయడానికి చూశారు. దానిని కూడా సక్రమంగా హ్యాండిల్ చేయలేకపోయారు. చివరకు ఆయన అరెస్టు కూడా జరిగిపోయింది. పార్టీకి డ్యామేజ్ మిగిల్చింది.

స్పోర్ట్స్ న్యూస్

చరిత్ర సృష్టించిన విండీస్ బౌలర్.. వరుసగా ఐదు ఓవర్లు మెయిడిన్లు.. ఐదు వికెట్లు



ట్రినిడాడ్‌లోని బ్రియాన్ లారా స్టేడియం వేదికగా పాకిస్థాన్, వెస్టిండీస్ మధ్య తొలి టెస్టు జరుగుతోంది. ఈ మ్యాచ్‌లో విండీస్ ఆల్‌రౌండర్ జస్టిన్ గ్రీవ్స్ అదిరిపోయే బౌలింగ్‌తో ప్రపంచ రికార్డును సృష్టించాడు. పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో తన తొలి ఐదు ఓవర్లలో గ్రీవ్స్ 27 పరుగులు ఇచ్చి ఒక వికెట్ కూడా తీయలేదు. అయితే తన సెకండ్ స్పెల్‌లో మాత్రం అద్భుతం చేశాడు.గ్రీవ్స్.. తన రెండో స్పెల్‌లో ఒక పరుగు కూడా ఇవ్వకుండా వరుసగా ఐదు ఓవర్లలో ఒక్కో వికెట్ చొప్పున మొత్తం ఐదు వికెట్లు పడగొట్టాడు. దీంతో వరుసగా ఐదు ఓవర్లు మెయిడిన్ చేసిన తొలి బౌలర్‌గా రికార్డు నెలకొల్పాడు. 2016లో జోహన్నెస్‌బర్గ్‌లో దక్షిణాఫ్రికాపై ఇంగ్లండ్ మాజీ ఫాస్ట్ బౌలర్ స్టువర్ట్ బ్రాడ్ నెలకొల్పిన వరుసగా నాలుగు వికెట్ల మెయిడిన్ల రికార్డును తాజాగా గ్రీవ్స్ అధిగమించాడు. అలానే టెస్టుల్లో గ్రీవ్స్‌కు ఇది తొలి ఐదు వికెట్ల ఘనత కావడం విశేషం.ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. మూడో రోజు పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 282 పరుగులకు ఆలౌటైంది. 244/4 స్కోరుతో ఉండగా తన రెండో స్పెల్‌ను ప్రారంభించిన జస్టిన్ గ్రీవ్స్.. పాక్ బ్యాటర్లకు చుక్కలు చూపించాడు. తన వరుస ఐదు ఓవర్లలో షాన్ మసూద్ (109), ఆమిర్ జమాల్ (3), అలీ ఉస్మాన్ (0), మహ్మద్ రిజ్వాన్ (12), మహ్మద్ అబ్బాస్ (0)లను పెవిలియన్‌కు పంపాడు.భారీ స్కోరు చేసేలా కనిపించిన పాక్.. గ్రీవ్స్ దెబ్బకు తక్కువ స్కోర్‌కే పరిమితమైంది. కరేబియన్ బౌలర్లలో కేమర్ రోచ్, షామర్ జోసెఫ్ చెరో రెండు వికెట్లు సాధించగా.. జేడెన్ సీల్స్ ఒక వికెట్ పడగొట్టాడు. ఇక మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో విండీస్ 126/7తో నిలిచి 155 పరుగుల ఆధిక్యంలో ఉంది. ప్రస్తుతం క్రీజులో కేమర్ రోచ్(5×), షామర్ జోసెఫ్(23) ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ 311 పరుగులు చేసింది.

శ్రీలంకతో టెస్టు సిరీస్.. జట్టును ప్రకటించిన బీసీసీఐ

ఇటీవల జింబాబ్వేతో మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0తేడాతో భారత్ జట్టు కైవసం చేసుకుంది. వచ్చే నెలలో శ్రీలంకతో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడనుంది. ఈ నేపథ్యంలో బీసీసీఐ భారత జట్టును ప్రకటించింది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ 15 మంది సభ్యులతో కూడిన జట్టు వివరాలను వెల్లడించింది. ఈ టెస్టు సిరీస్‌కు శుభ్‌మన్ గిల్ నాయకత్వం వహించనున్నాడు. అలానే కేఎల్ రాహుల్ వైస్ కెప్టెన్‌గా ఉండనున్నాడు.బీసీసీఐ ప్రకటించిన జట్టులో టీమిండియా సీనియర్ ప్లేయర్ రవీంద్ర జడేజాకు చోటుదక్కింది. దాదాపు ఏడాది తర్వాత జడేజా టెస్టుల్లో రీఎంట్రీ ఇవ్వనున్నాడు. సారాన్ష్ జైన్‌కు తొలిసారి భారత జట్టులో చోటు దక్కింది. మధ్యప్రదేశ్ తరపున 131 ఫస్ట్-క్లాస్ వికెట్లు సాధించిన జైన్, ఇటీవల శ్రీలంక 'ఎ' జట్టుపై ఇండియా 'ఎ' తరపున అద్భుత ప్రదర్శనలతో జట్టులో తన స్థానాన్ని పదిలపరుచుకున్నాడు.అలానే జస్ప్రీత్ బుమ్రా, సాయి సుదర్శన్ లను ఎంపిక చేసినప్పటికీ సిరీస్ ప్రారంభమయ్యే సమయానికి ఫిట్‌నెస్ నిరూపించుకోవాల్సి ఉంటుందని బీసీసీఐ స్పష్టం చేసింది. రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి టెస్టు ఆగస్టు 15 నుంచి 19 మధ్య గాలే వేదికగా జరగనుంది. ఆగస్టు 23 నుంచి 27 వరకు జరిగే రెండో టెస్టుకు కొలంబో వేదిక కానుంది. ఈ సిరీస్‌కు ముందు భారత జట్టు ఆగస్టు 7వ తేదీ నుంచి కొలంబోలో నాలుగు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనుంది.శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), కెఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్, జస్ప్రీత్ బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, దేవదత్ పడిక్కల్, సరన్ష్ జైన్



అప్పుడు తండ్రి.. ఇప్పుడు కొడుకు.. కామన్‌వెల్త్ గేమ్స్‌లో విజయనగరం కుర్రాడికి రజతం

ఢిల్లీ వేదికగా 2010లో జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో తండ్రి కాంస్య పతకంతో దేశ కీర్తిని పెంచితే.. సరిగ్గా 16 ఏళ్ల తర్వాత అదే కామన్వెల్త్ వేదికపై తనయుడు రజత పతకంతో సంచలనం సృష్టించాడు. పురుషుల 79 కేజీల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో ఏపీలోని విజయనగరం జిల్లాకు చెందిన 21 ఏళ్ల వల్లూరి అజయ్ బాబు రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు.ఉత్కంఠభరితంగా సాగిన పోరులో అజయ్ బాబు మొత్తం 330 కేజీల బరువును (స్నాచ్‌లో 149 కేజీలు + క్లీన్ అండ్ జెర్క్‌లో 181 కేజీలు) ఎత్తి రెండో స్థానంలో నిలిచాడు. కేవలం ఒక్క కేజీ తేడాతో మలేషియాకు చెందిన ఎర్రీ హిదాయత్ మహమ్మద్ ఫసిడి పతకాన్ని కైవసం చేసుకోగా, ఇంగ్లండ్‌కు చెందిన క్రిస్ ముర్రే (325 కేజీలు) కాంస్యం సాధించాడు. కామన్వెల్త్ గేమ్స్2026లో ప్రస్తుతం భారత్‌కు వెయిట్‌లిఫ్టింగ్‌లో ఇది ఆరో పతకం కావడం విశేషం.అజయ్ బాబు స్వగ్రామం విజయనగరం జిల్లాలోని కొండవెలగాడ గ్రామం. ఇతని తండ్రి వల్లూరి శ్రీనివాసరావు కూడా అంతర్జాతీయ వెయిట్‌లిఫ్టర్ కావడం గమనార్హం. శ్రీనివాసరావు 2010 ఢిల్లీ కామన్వెల్త్ గేమ్స్ (56 కేజీల విభాగం)లో కాంస్యం గెలిచాడు. తండ్రి అందించిన శిక్షణతో ముందుకు సాగిన అజయ్ బాబు.. తండ్రి సాధించిన పతకం కంటే ఒక అడుగు ముందుకేసి రజతం సాధించి తెలుగు నేల కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో రెపరెపలాడించాడు.




విమర్శలను పట్టించుకోను: శాంసన్



తిరువనంతపురం: వరుస వైఫల్యాలతో టీమిండియాలో చోటు కోల్పోయిన స్టార్ ఆటగాడు సంజు శాంసన్ ఇటీవల కాలంలో ఇంటాబయటా విమర్శలు ఎదుర్కొంటున్న నంగతి తెలిసిందే. ఎన్నో అవకాశాలు లభించినా శాంసన్ నద్వినియోగం చేసుకోలేదని, ఇలాంటి స్థితిలో అతన్ని జట్టు నుంచి తప్పించడం ఏమాత్రం తప్పుకాదని పలువురు మాజీ క్రికెటర్లు, విశ్లేషకులు అభిప్రాయపడిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై శాంసన్ స్పందించాడు. కెరీర్‌లో ఎత్తుపల్లాలు సహాజమన్నాడు.

యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్: సబలెంకాతో జతకట్టనున్న జకోవిచ్



యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ ఛాంపియన్‌షిప్‌లో టెన్నిస్ దిగ్గజం నొవాక్ జకోవిచ్, ప్రపంచ నంబర్ 1 మహిళా ప్లేయర్ అరీనా సబలెంకా జోడీగా బరిలోకి దిగనున్నారు. వీరితో పాటు పాల్గొనే 16 జోడీల జాబితాను టోర్నీ నిర్వాహకులు ప్రకటించారు. 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచిన జకోవిచ్ అనుభవానికి, సబలెంకా దూకుడు ఆట జత కావడంతో ఈ జోడీ టైటిల్ ఫేవరెట్‌గా భావిస్తున్నారు. గతేడాది ప్రవేశపెట్టిన కొత్త మిక్స్‌డ్ డబుల్స్ ఫార్మాట్‌ను యూఎస్ టెన్నిస్ అసోసియేషన్ ఈసారి కూడా కొనసాగిస్తోంది. ఆగస్టు 25, 26 తేదీల్లో సింగిల్స్ ప్రధాన డ్రాకు ముందే ఈ పోటీలు నిర్వహించనున్నారు. విజేత జోడీకి 10 లక్షల అమెరికన్ డాలర్లు ప్రైజ్ మనీగా అందజేయనున్నారు.జకోవిచ్, సబలెంకాతో పాటు 2025లో రన్నరప్‌గా నిలిచిన ఇగా స్వియాటెక్, కాస్పర్ రూడ్, ఎలెనా రైబాకినా-టేలర్ ఫ్రిట్జ్, నవోమి ఒసాకా-కీ నిషికోరి, జెస్సికా పెగులా-జాక్ డ్రేపర్ మరోసారి బరిలోకి దిగనున్నారు. ఆర్థర్ ఆషే స్టేడియం, లూయిస్ ఆర్మ్‌స్ట్రాంగ్ స్టేడియాల్లో అన్ని మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. కాగా జకోవిచ్, సబలెంకా కోర్టు వెలుపల కూడా మంచి స్నేహితులు. కొన్నేళ్లుగా ఇద్దరూ కలిసి సాధన చేయడం, ఒకరికి ఒకరు సలహాలు ఇచ్చుకోవడం అభిమానులను ఆకట్టుకుంది. జకోవిచ్ అనుభవం, సబలెంకా పవర్ హిట్టింగ్ కలిస్తే ప్రత్యర్థులకు గట్టి సవాలు తప్పదని టెన్నిస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మిక్స్‌డ్ డబుల్స్‌లో మొత్తం ఆరు జట్లు సింగిల్స్ ర్యాంకింగ్స్ ఆధారంగా నేరుగా అర్హత సాధించనున్నాయి. మిగిలిన స్థానాలను వైల్డ్ కార్డులు, క్వాలిఫయర్ల ద్వారా భర్తీ చేయనున్నారు. డిఫెండింగ్ ఛాంపియన్లు సారా ఎర్రాని, ఆండ్రీ వవస్సోరిలు కూడా తమ టైటిల్‌ను నిలబెట్టుకునేందుకు పోటీలోకి రానున్నారు.

కొడుకు కల కోసం క్యాన్సర్‌ను దాచిన తండ్రి.. 11 ఏళ్ల నిరీక్షణకు ఫలితం!

చాలా మంది కష్టపడుతూ అవకాశం కోసం కొంత సమయం మాత్రమే ఎదురు చూస్తుంటారు. కానీ ఇంకొందరు మాత్రం అవకాశం వచ్చే వరకు పోరాడుతూనే ఉంటారు. చివరకు అనుకున్నది సాధించి.. చరిత్రలో నిలుస్తారు. అలాంటి వారి జాబితాలో నిలుస్తాడు టీమిండియా క్రికెటర్ సరాంశ్ జైన్. దేశవాళీ క్రికెట్‌లో ఏళ్ల తరబడి నిలకడగా రాణిస్తున్న సరాంశ్‌కు తన కెరీర్‌లోనే అద్భుతమైన అవకాశం లభించింది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఈ 33 ఏళ్ల ఆఫ్ స్పిన్నర్ రెడ్‌బాల్ క్రికెట్‌లో అదరగొట్టి 11 ఏళ్ల నిరీక్షణ తర్వాత భారత జట్టులో చోటు దక్కించుకున్నాడు.వచ్చే నెలలో శ్రీలంకతో జరగనున్న రెండు మ్యాచ్‌ల సిరీస్‌కు సరాంశ్ జైన్‌ను బీసీసీఐ ఎంపిక చేసింది. గాయపడిన వాషింగ్టన్ సుందర్ స్థానంలో అతడికి చోటు దక్కింది. ఇటీవల శ్రీలంక పర్యటనకు వెళ్లిన భారత-ఏ జట్టులో సరాంశ్ ఉన్నాడు. లంకతో జరిగిన రెండో టెస్టులో సరాంశ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఆరు వికెట్లు పడగొట్టిన జైన్.. బ్యాటింగ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 70 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు.మధ్యప్రదేశ్ సీనియర్ జట్టులో స్థానం సంపాదించినప్పటి నుంచి లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ అయిన సరాంశ్ అన్ని విభాగాల్లో రాణించి మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. క్రమశిక్షణతో కూడిన బౌలింగ్‌తో బ్యాటర్లను కట్టడి చేస్తూ.. కీలక సమయాల్లో వికెట్లు తీస్తుంటాడు. అలానే బ్యాటింగ్‌లోనూ జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకుంటాడు. భారత్ ఎ, సెంట్రల్ జోన్ (దులీప్ ట్రోఫీ), రెస్ట్ ఆఫ్ ఇండియా (ఇరానీ ట్రోఫీ) తరఫున రాణించాడు. దీంతో బీసీసీఐ సెలక్టర్ల దృష్టిలో పడి తాజాగా జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు.తన క్రికెట్ కెరీర్ కోసం కుటుంబం ఏ విధంగా అండగా నిలిచిందో తెలిపే ఒక సంఘటనను జైన్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. 2014లో మధ్యప్రదేశ్ క్లబ్ తరఫున ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్నప్పుడు జైన్ తండ్రికి క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయిందట. సరాంశ్ ఆటపైనే పూర్తిగా దృష్టి సారించడానికి అతడి తండ్రికి జరిగిన క్యాన్సర్ శస్త్రచికిత్స గురించి అప్పుడు కుటుంబసభ్యులు తెలియజేయలేదట. ఇండియాకు వచ్చిన తర్వాతే తన తండ్రి ఆరోగ్యం గురించి తెలిసిందని ఆ ఇంటర్వ్యూలో జైన్ వెల్లడించాడు.



విదేశాల్లో భారత బ్యాటర్ల వైఫల్యానికి బౌండరీలే కారణం: సునీల్ గావస్కర్

భారత జట్టు విదేశాల్లో వరుస వైఫల్యాలు ఎదుర్కొంటున్న అంశంపై మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇటీవల శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలోని టీమిండియా.. ఐర్లాండ్, ఇంగ్లండ్ చేతిలో క్లీన్ స్వీప్ అయిన సంగతి తెలిసిందే. స్వదేశంలో విధ్వంసం సృష్టించే బ్యాటర్లు.. విదేశీ పిచ్‌లపై తేలిపోతున్నారంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనికి బౌండరీలే అసలు సమస్య అంటూ గావస్కర్ స్పష్టం చేశాడు. స్వదేశంలో మరో సీజన్ ప్రారంభానికి ముందే బౌండరీల పరిమాణాన్ని పెంచాలని బీసీసీఐకి గావస్కర్ సూచించాడు.'ఐపీఎల్‌లో బౌండరీలు దాటే మిస్‌హిట్ షాట్లు విదేశాల్లో పెద్ద బౌండరీల కారణంగా ఫీల్డర్ల చేతికి చిక్కుతున్నాయి. చాలా మైదానాల్లో ఎల్ఈడీ ప్రకటనల బోర్డుల వెనుక తగినంత స్థలం ఉంటుంది. బౌండరీ తాళ్లను కొంత వెనక్కి జరిపితే బ్యాటర్లు ప్రపంచ కప్‌నకు మెరుగ్గా సిద్ధమవుతారు. బౌండరీలు పెద్దగా చేయడం వల్ల భారత స్పిన్నర్లకు కూడా ప్రయోజనం ఉంటుంది. నెమ్మదిగా బంతి వేస్తే ఎక్కువ టర్న్, లూప్ లభిస్తాయి. స్పిన్నర్లు వేగంగా బంతులు సంధించడం వల్ల బ్యాటర్లు సులభంగా భారీ షాట్లు ఆడుతున్నారు. ఇంగ్లండ్ స్పిన్నర్లు ఆదిల్ రషీద్, విల్ జాక్స్.. భారత స్పిన్నర్ల కంటే గంటకు 8-10కిమీ తక్కువ వేగంతో బౌలింగ్ చేసి ఎక్కువ ప్రభావం చూపారు' అని సునీల్ గావస్కర్ విశ్లేషించాడు.టీ20 ప్రపంచ కప్ 2026 విజయం తర్వాత టీమిండియా వరుస పరాజయాలు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. పసికూన ఐర్లాండ్, ఇంగ్లండ్ జట్లతో వరుసగా సిరీస్ క్లీన్‌స్వీప్ అయింది. ఆ తర్వాత జింబాబ్వే పర్యటనకు వెళ్లిన భారత జట్టు.. అక్కడ పుంజుకుని వరుస పరాజయాలకు బ్రేక్ వేసింది. జింబాబ్వేపై మూడు టీ20ల సిరీస్ ఆడి గెలిచి సిరీస్ క్లీన్‌స్వీప్ చేసింది.



సినిమా

ఎన్టీఆర్,త్రివిక్రమ్ గాడ్ ఆఫ్ వార్

హీరోయినేగా కియారాపై చర్చ





యంగ్ టైగర్ ఎన్టీఆర్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టుల్లో 'గాడ్ ఆఫ్ వార్' ఒకటి. స్టార్ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కించనున్న ఈ భారీ పాన్ ఇండియా చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన కాన్సెప్ట్ పోస్టర్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచగా.. ఇప్పుడు హీరోయిన్‌కు సంబంధించిన వార్తలు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. ఈ చిత్రంలో హీరోయిన్ పాత్ర కోసం బాలీవుడ్ స్టార్ కియారా అద్వానీ పేరును పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ చిత్రం పురాణ గాథల స్ఫూర్తితో రూపొందనున్న మైథలాజికల్ యాక్షన్ డ్రామా అని వార్తలు వస్తుండగా.. ఎన్టీఆర్ ఇందులో శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నట్లు టాక్. కథలో కీలకమైన మహిళా పాత్రకు కియారా సరిపోతారని మేకర్స్ భావిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఎన్టీఆర్, కియారా అద్వానీ ఇప్పటికే 'వార్ 2' చిత్రంలో కలిసి నటించిన సంగతి తెలిసిందే. అయితే ఆ సినిమాలో వారి మధ్య పూర్తి స్థాయి జోడీ కనిపించలేదు. కియారా నటించిన 'భరత్ అనే నేను' ఘన విజయం సాధించగా, రామ్ చరణ్‌తో చేసిన 'వినయ విధేయ రామ', గేమ్ ఛేంజర్' ఆశించిన ఫలితాలను అందుకోలేకపోయాయి. దీంతో కొందరు అభిమానులు ఈ విషయాన్ని సోషల్ మీడియాలో సెంటిమెంట్‌గా చర్చిస్తున్నారు. నటుడు సిద్ధార్థ్ మల్హోత్రాను వివాహం చేసుకున్న తర్వాత కూడా వరుస ప్రాజెక్టులతో బిజీగా కొనసాగుతున్నారు. మరోవైపు ఎన్టీఆర్ ప్రస్తుతం దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'డ్రాగన్' షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ సినిమా పూర్తయిన తర్వాతే త్రివిక్రమ్ దర్శకత్వంలోని 'గాడ్ ఆఫ్ వార్' సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉందని సమాచారం.

టాక్సిస్ నుంచి మనసాగదే..పాట విడుదల

యశ్ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'టాక్సిక్' గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ఆగస్టు 26న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. చిత్ర ప్రచారంలో భాగంగా 'మనసాగదే.. ' అంటూ సాగే పాటను చిత్ర బృందం తాజాగా విడుదల చేసింది. తనిష్ బాగ్చీ, అర్సాన్ నిజామి, ఫహీమ్ అబ్దుల్లా స్వరాలు సమకూర్చిన ఈ పాటకు రామ జోగయ్యశాస్త్రి సాహిత్యం అందించారు. సిద్ధార్థ్ బస్రూర్ ఆలపించారు. యశ్‌తో (జజీబత) పాటు, నయనతార, కియారా అద్వాణీ, హ్యుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్‌లు ఈ మూవీలో నటిస్తున్నారు ఓ సరికొత్త యాక్షన్ డ్రామాగా గీతూ మోహన్ దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు అర్థమవుతోంది.



బోల్డ్ సన్నివేశాల్లో నటించలేను: కాజల్



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ మరోసారి తన వ్యక్తిగత అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడించారు. సినిమాల్లో బికినీ, బోల్డ్ సన్నివేశాలు, రొమాంటిక్ సీన్స్‌పై ఇటీవల జరుగుతున్న చర్చల మధ్య ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా పెళ్లి తర్వాత హీరోయిన్లు గ్లామర్ పాత్రలు చేయడంపై వస్తున్న విమర్శల నేపథ్యంలో కాజల్ స్పందించిన తీరు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రస్తుతం 'ది ఇండియా స్టోరీ' సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న కాజల్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, కెరీర్ ప్రారంభం నుంచే తాను బికినీ లేదా అతిగా బోల్డ్ సన్నివేశాల్లో నటించడానికి ఆసక్తి చూపలేదని తెలిపారు. అలాంటి పాత్రలు చేయడం తనకు వ్యక్తిగతంగా అసౌకర్యంగా అనిపిస్తుందని, అందుకే ఎన్నో భారీ చిత్రాలను కూడా వదులుకున్నానని వెల్లడించారు. సినిమాల కోసం లేదా డబ్బు కోసం నా వ్యక్తిత్వాన్ని మార్చుకోలేను. నాకు కొన్ని విలువలు, సిద్ధాంతాలు ఉన్నాయి. వాటిని నేను ఎప్పుడూ రాజీ పడను. తెరపై బోల్డ్ సీన్స్ చేయాల్సిన అవసరం ఉందని నేను భావించను అని కాజల్ స్పష్టం చేశారు. తల్లి అయిన తర్వాత తన ఆలోచనల్లో మరింత మార్పు వచ్చిందని కూడా ఆమె తెలిపారు. తన కుమారుడు నీల్ కిచ్లూ పెద్దయ్యాక తన సినిమాలు చూసి గర్వపడాలని కోరుకుంటానని, తన నటించిన పాత్రల గురించి భవిష్యత్తులో తన బిడ్డకు వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతో కథలు, పాత్రల ఎంపికలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు.నా కొడుకు నా సినిమాలు చూసి గర్వపడాలి. అతను అసౌకర్యంగా ఫీలయ్యే పాత్రలు నేను చేయాలనుకోవడం లేదు. అందుకే ఇప్పుడు ప్రతి కథను చాలా ఆలోచించి ఎంపిక చేసుకుంటున్నాను అని ఆమె పేర్కొన్నారు. ఇదిలా ఉంటే, ఇటీవల 'టాక్సిక్' సినిమాలో యశ్‌తో కలిసి నటించిన కియారా అద్వానీ రొమాంటిక్ సన్నివేశాలపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ జరిగిన నేపథ్యంలో కాజల్ పాత వ్యాఖ్యలు మళ్లీ వైరల్ అవుతున్నాయి.

విశ్వనాథం అండ్ సన్స్ నుంచి కొత్త లుక్ విడుదల

కోలీవుడ్ స్టార్ హీరో సూర్యకు తమిళంతో పాటు తెలుగులోనూ భారీ అభిమాన వర్గం ఉంది. ఇటీవల విడుదలైన 'వీరభద్రుడు' సినిమాతో మాస్ హిట్ అందుకున్న ఆయన, ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. టాలీవుడ్ దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కిస్తున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. సూర్య పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం విడుదల చేసిన కొత్త పోస్టర్లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా బ్రౌన్ కలర్ సూట్‌లో సూర్య కనిపించిన స్టైలిష్ లుక్ అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. చాలా కాలం తర్వాత సూర్యను ఇలాంటి క్లాస్, వింటేజ్ స్టైల్‌లో చూడటం ఫ్యాన్స్‌కు ప్రత్యేకమైన ఆనందాన్ని కలిగిస్తోంది. ఈ పోస్టర్లతో సినిమాపై మరింత హైప్ పెంచిన మేకర్స్ మరో సర్‌ప్రైజ్ కూడా ప్రకటించారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌కు మంచి స్పందన రావడంతో, ఈ కొత్త పాటపై కూడా అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం కుటుంబ భావోద్వేగాలతో పాటు కమర్షియల్ అంశాలను కలగలిపిన కథతో తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. సూర్యను కొత్త కోణంలో చూపించే ఈ సినిమా ఆయన కెరీర్‌లో మరో ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో సూర్య బర్త్‌డే పోస్టర్లు ట్రెండింగ్‌లో ఉండగా, సాయంత్రం విడుదల కానున్న రెండో సాంగ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



రాజకీయ ఎంట్రీ ఆధారంగా రూపొందిన జననాయగన్



తమిళనాడు ముఖ్యమంత్రి, కథానాయకుడు విజయ్ నటించిన చివరి చిత్రం 'జన నాయగన్' తెలుగులో 'జన నాయకుడు' పేరుతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సంక్రాంతికి విడుదల కావాల్సిన ఈ మూవీ సమస్యలను దాటుకుని ఎట్టకేలకు విడుదలైంది. దళపతి వెట్రి కొండాన్ (విజయ్) ఓ ఖైదీగా జైలు జీవితాన్ని గడుపుతుంటాడు. ఓ వ్యాపారవేత్తని అంతం చేయడానికి జైలుపై పడిన ముఠాని ఎదురించి నిజాయతీ కలిగిన జైలు అధికారి (గౌతమ్ మేనన్) దృష్టిని ఆకర్షిస్తాడు. ఆ అధికారి సాయంతో ఆగస్టు 15న క్షమాభిక్ష కింద బయటకొస్తాడు వెట్రి. అంతలోనే ఆ అధికారి ఓ ప్రమాదంలో మరణిస్తాడు. దాంతో అతని కుమార్తె విజ్జి (మమిత బైజు)ని పెంచే బాధ్యతని వెట్రి తన భుజాన వేసుకుంటాడు. చిన్నప్పుడు తల్లి దారుణ హత్యని ప్రత్యక్షంగా చూసిన విజ్జి ప్రతి చిన్న విషయానికీ భయంతో వణికిపోతుంటుంది. ఆమెను ధైర్యవంతురాలిగా మార్చి, సైన్యంలో చేర్పించాలని నిర్ణయించుకుంటాడు. అందుకోసం శిక్షణ కూడా ఇప్పిస్తుంటాడు. ఇంతలో జాన్ హిమ్లర్ (బాబీ దేవోల్) విజ్జిని లక్ష్యంగా చేసుకుని ఆమెని అంతం చేయాలని తన ముఠాని పంపుతాడు. ఇంతకీ విజ్జిని జాన్ హిమ్లర్ లక్ష్యంగా చేసుకోవడానికి కారణమేమిటి? హిమ్లర్ ఎవరు? అతన్ని వెట్రి కొండాన్ ఎలా ఎదిరించాడు?విజ్జిలోని భయాన్ని పోగొట్టి ఆమెని ధైర్యవంతురాలిగా మార్చాడా?లేదా? విద్వేషాల్ని రగిలించడానికి పతకం వేసిన జాన్ హిమ్లర్ అసలు లక్ష్యమేమిటి?ఆయనకీ రాజకీయ నాయకుడు రోజా రంగస్వామి (ప్రకాశ్‌రాజ్)కీ మధ్య సంబంధం ఏమిటన్నది కథ. తెలుగులో విజయంతమైన 'భగవంత్ కేసరి' స్ఫూర్తితో రూపొందిన చిత్రమిది. ఇది మక్కీకి మక్కీ రీమేక్ కానప్పటికీ... ఆ కథలోని ఆత్మ, పాత్రలు పక్కాగా కనిపిస్తాయి. దాంతో తెలుగు ప్రేక్షకులకు అడుగడుగునా 'భగవంత్ కేసరి' సినిమానే గుర్తొస్తుంది.విజయ్ రాజకీయ అజెండా, మితిమీరిన వాణిజ్యాంశాల మధ్య కథలోని అసలు ఆత్మ నలిగిపోయింది. తమిళనాడు ఎన్నికలకు ముందు రూపొందిన ఈ సినిమా విజయ్ రాజకీయ ఆలోచనల్ని, అజెండాని మాత్రం పక్కాగా తెరపై ఆవిష్కరించింది. ఆయనకు రాజకీయంగా లబ్ధి చేకూర్చే విషయాలు సినిమాలో అడుగడుగునా కనిపిస్తాయి. ఓ సన్నివేశంలో తమ్ముడూ... అంటూ విజయ్ చేతికి చెర్నాకోల అందిస్తారు ఎంజీఆర్. శత్రువుల భరతం పట్టు అన్నట్టుగా! అవన్నీ విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ కార్యకర్తలకూ, ఆయన అభిమానులకూ నచ్చే విషయాలే.గుడ్ టచ్ బ్యాడ్ టచ్ నేపథ్యంలో తెలుగులో రూపొందించిన సన్నివేశాలు సినిమాకి ప్రధానబలం. అయితే 'జన నాయకుడు'లో ఆ సన్నివేశాలు అంత ప్రభావం చూపించవు. విజ్జి పాత్రలో చోటు చేసుకునే మార్పు మాత్రం తెలుగుకు దీటుగానే తమిళంలో రూపొందింది. డ్యాన్సులతోనూ, పంచ్ డైలాగులతోనూ, వేనరిజమ్స్‌తోనూ విజయ్ అదరగొట్టారు. ముఖ్యంగా కచ్చేరీ పాటలో ఆయన వేసిన స్టెప్‌లు అభిమానులకు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. విజ్జి పాత్రలో మమిత బైజు మంచి నటనని ప్రదర్శించారు. పతాక సన్నివేశాల్లో ఆమె చేసిన పోరాటాలు ఆకట్టుకుంటాయి. పూజా హెగ్డే పాత్ర పరిధి తక్కువే కానీ, ఆమె తెరపై హుందాగా కనిపించారు. బాబీ దేవోల్ పాత్రలో బలం ఉంది. ముఖ్యంగా ద్వితీయార్ధంలో ఆయన పాత్రలో చోటు చేసుకునే మార్పు మంచి డ్రామాని పండిస్తుంది. ప్రియమణి పాత్రలో మలుపు ఆకట్టుకుంటుంది. ప్రకాశ్‌రాజ్, నాజర్, గౌతమ్ మేనన్ పాత్రల పరిధికి తగ్గట్టుగా నటించారు.

టాక్సిస్ ..భిన్నమైన కథాంశంతో రూపొందించిన చిత్రం

కేజీఎఫ్ సిరీస్‌తో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రాక్ స్టార్ యశ్ నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్: చిత్రం ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇటీవల విడుదలైన టీజర్, ప్రోమో వీడియోలు, పాటల్లో కనిపించిన బోల్డ్ కంటెంట్ సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాత కె. వెంకట నారాయణ తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో సినిమాపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టాక్సిక్ సాధారణ కమర్షియల్ సినిమా కాదని, తాము ఇప్పటివరకు నిర్మించిన చిత్రాల కంటే పూర్తిగా భిన్నమైన కథాంశంతో రూపొందించామని ఆయన తెలిపారు. ప్రేక్షకులు థియేటర్లలో ఈ సినిమాను చూసిన తర్వాత తప్పకుండా కొత్త అనుభూతిని పొందుతారని, సినిమా ముగిసిన తర్వాత చిత్ర బృందాన్ని అభినందిస్తారనే పూర్తి నమ్మకం తనకు ఉందని పేర్కొన్నారు. అంతేకాకుండా, 'టాక్సిక్' ఒక కల్పిత కథ ఆధారంగా రూపొందిన సినిమా అని, ముఖ్యంగా పెద్దల కోసం రూపొందించిన ప్రత్యేక కథనమని ఆయన స్పష్టం చేశారు. సినిమా టైటిల్‌కు తగ్గట్టుగానే ఇందులో భావోద్వేగాలు, యాక్షన్, రొమాన్స్ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలు ఉంటాయని సంకేతాలు ఇచ్చారు. ఇటీవల విడుదలైన 'మనసాగదే' పాటకు అద్భుతమైన స్పందన లభిస్తోంది. యశ్, తారా సుతారియా మధ్య సాగే ఈ రొమాంటిక్ ట్రాక్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచింది. ముఖ్యంగా పాటలోని విజువల్స్, సంగీతం, ఇద్దరి కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి.ఈ పాటపై హీరోయిన్ తారా సుతారియా కూడా స్పందించారు. పాటలోని కొన్ని సన్నివేశాలను ఎంతో అందంగా చిత్రీకరించారని, చిత్రబృందం విజువల్‌గా అద్భుతమైన అనుభూతిని అందించిందని ఆమె సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు. దీంతో ఈ పాటకు మరింత క్రేజ్ ఏర్పడింది. భారీ తారాగణంతో రూపొందుతున్న ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషీ, తారా సుతారియా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

Edited, Printed, Published and Owned by NASREEN KHAN , Printed at M/s DATTASAI GRAPHICS :1-1-651/8, Gandhi Nagar, Hyderabad-500 080
Published from H.No.1-7-137, Flat 402, Vijaysai Apartments, Zamistanpur, Musheerabad, Hyderabad- 20, (Telangana) Editor:Nasreen Khan, Ph : 040-27602786, Cell : 965243981 .R.N.I.No.TELTEL/2013/51844